నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
మంగళవారం | మార్చి 05, 2024 | www.navatelangana.com

తెలంగాణ ఉద్యమకారులకు సర్టిఫికెట్ల అందజేత

నవతెలంగాణ-జన్నారం

తెలంగాణ మలిదశ ఉద్యమంలో పాల్గొన్న పలువురికి ప్రభుత్వం గుర్తించిన తెలంగాణ ఉద్యమకారుల సర్టిఫికెట్లను అందజేశారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో తపాలాపూర్ గ్రామానికి చెందిన కమ్మల విజయధర్మ, రాంపూర్ గ్రామానికి చెందిన దాసరి రమేష్, దండేపల్లి మండలం తాళ్లపేట గ్రామానికి చెందిన కంది రవి, కంది సతీష్ జైలు జీవితం అనుభవించారు. వీరిని ధ్రువీకరిస్తూ జైలర్ తేజావత్ స్వామి వారికి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు పాల్గొన్నారు.



పోలీస్ కుటుంబానికి భద్రత చెక్కు అందజేత

నవతెలంగాణ-నిర్మల్

ఆకస్మికంగా మరణించిన హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి పోలీస్ భద్రత నుండి మంజూరైన చెక్కును సోమవారం ఎస్పీ డా.జి.జానకి షర్మిల కుటుంబానికి అందజేశారు. మామడ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న వెంకటేశ్వర్లు అనారోగ్యంతో బాధ పడుతూ 2023 అక్టోబర్ 27న మరణించాడు. దీంతో తెలంగాణ పోలీస్ భద్రత పథకం ద్వారా కుటుంబానికి మంజూరైన రూ.7,56,881, ఇతర పథకం కింద రూ.60వేల చెక్కులను భార్యకు అందజేశారు. కార్యక్రమంలో ఏఓ యూనుస్ అలీ, సెక్షన్ సూపరింటెండెంట్ నర్సమ్మ, పోలీస్ అధికారుల సంఘం ప్రతినిధి విరాసత్ అలీ పాల్గొన్నారు.



నెరవేరని ఆశలు..!

- జిల్లా సమస్యలు ప్రస్తావించని ప్రధాని మోడీ
- రైల్వేలైన్, సీసీఐ పునరుద్ధరణపై ఊసెత్తని వైనం
- అసంతృప్తి వ్యక్తం చేసిన జిల్లావాసులు
- బహిరంగ సభకు భారీగా హాజరైన జనం



ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్‌టౌన్

కుమురంభీం వారసులారా..అంటూ జిల్లావాసులను పలకరించిన ప్రధాని మోడీ.. ప్రజలు దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న సమస్యలను మాత్రం ప్రస్తావించకపోవడం జిల్లావాసులను నిరాశకు గురిచేసింది. తన ప్రసంగంతో జనాలను ఆకట్టుకునే రీతిలో మాట్లాడినప్పటికీ.. సమస్యల పరిష్కారానికి భరోసా మాత్రం లభించలేదు. దీంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసుల ఆశలు అడియాశలయ్యాయి. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు ఆయా సమస్యలను పరిష్కరించాలని సభలో కోరినా..ప్రధాని మోడీ వాటిని ప్రస్తావించకపోవడంతో ప్రజల్లో నిరాశ వ్యక్తమైంది. జిల్లాకు ప్రత్యేకంగా ఎలాంటి హామీలు లభించకపోవడంతో అసంతృప్తికి గురయ్యారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని మైదానంలో బీజేపీ నిర్వహించిన విజయ సంకల్ప సభకు ప్రధాని మోడీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కుమురంభీం, రాంజీగోండ్ పేర్లు ప్రస్తావించి జిల్లా ప్రజలను ఆకట్టుకున్నారు. నా తెలంగాణ కుటుంబ సభ్యులందరికీ నమస్కారం..అంటూ తెలుగులో ప్రసంగించడంతో సభికుల నుంచి ఉత్సాహం వెల్లువెత్తింది. అనంతరం హిందీలో మాట్లాడారు. అక్కడక్కడ తన ప్రసంగంలో తెలుగు పదాలను ప్రస్తావించారు.

సమస్యలను ప్రస్తావించని మోడీ..!

ఆదిలాబాద్‌లో మూతపడిన సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణ అంశం ప్రసంగంలో ప్రస్తావిస్తారని జిల్లావాసులు ఆశలు పెట్టుకున్నారు. తొలిసారి జిల్లాకు ప్రధాని రావడంతో ఈ పరిశ్రమపై ప్రకటన చేస్తారని అంతా భావించారు. వీటితో పాటు ఆదిలాబాద్ -ఆర్మూర్ రైల్వేలైన్ పనులు ప్రారంభించాలని, గిరిజన యూనివర్సిటీ మంజూరుచేయాలని, ఎయిర్‌పోర్ట్ నిర్మించాలని, టెక్స్‌టైల్ పార్కును మంజూరుచేయాలని ఎంపీ సోయం బాపురావు, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌లు వారి ప్రసంగంలో ప్రస్తావించారు. అనంతరం ప్రధాని మాట్లాడే సమయంలో వీటిని ప్రస్తావిస్తారని అందరూ భావించారు. కానీ కేంద్రప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రస్తావించిన ప్రధాని..ప్రజాప్రతినిధులు కోరిన వాటిని పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో సభకు హాజరైన జనంలోనూ నిరాశ కనిపించింది. సభ ముగిసిన తర్వాత అసంతృప్తి వ్యక్తం చేస్తూ కనిపించారు.

భారీగా హాజరైన జనం..!

మోడీ బహిరంగ సభకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా జనాలు భారీగా తరలివచ్చారు. మోడీ రాక కోసం ఉదయం నుంచే జనాలు ఆసక్తిగా ఎదురుచూశారు. వివిధ ప్రాంతాల నుంచి ఉదయం 9గంటలకే సభాస్థలికి చేరుకున్నారు. ఉదయం 11.20గంటలకు ఆదిలాబాద్‌కు చేరుకున్న మోడీ తొలుత అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం 12గంటల సమయంలో సభా వేదికపైకి వచ్చారు. మోడీ రాగానే జనాలు ఒక్కసారిగా మోడీ అనుకూల నినాదాలు చేస్తూ ఉత్సాహం కనబర్చారు. మోడీ..మోడీ అంటూ కొద్దిసేపు నినదించారు. మోడీ ప్రసంగిస్తున్న సమయంలో జనం ఆసక్తిగా తిలకించారు. జనాల్లో వ్యక్తమైన ఈ ఉత్సాహంతో బీజేపీ శ్రేణుల్లో హర్షం వ్యక్తమైంది.

భారీ బందోబస్తు..!

మోడీ సభకు పోలీసు యంత్రాంగం భారీ బందోబస్తు ఏర్పాటుచేసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సభా స్థలికి వచ్చేవారిని క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి పంపించారు. పట్టణంలో పలు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. సుమారు 2వేల మంది పోలీసులు మోడీ సభ ముగిసే వరకు పోలీసులు పకడ్బందీ బందోబస్తు నిర్వహించారు. పోలీసు ఉన్నతాధికారులు నిరంతరం బందోబస్తును పర్యవేక్షించారు.



బహిరంగ సభలో పాల్గొన్న మహిళలు

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

- శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలి
- రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్



నవతెలంగాణ-దండేపల్లి

ప్రజల రక్షణ ధ్యేయంగా పోలీసులు పని చేస్తున్నారని, శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఇంటర్ పరీక్షలను ఆయన పరిశీలించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ డయల్ 100కు తక్షణమే స్పందించాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. బియ్యం, గుడుంబా, గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంటుందని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేసే వారిని వదిలి పెట్టేది లేదని హెచ్చరించారు. తరచు నమోదు అవుతున్న కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాటికి గల కారణాలు పరిశీలించి నియంత్రించే విధంగా కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. సీసీ కెమెరాల పనితీరు, నేరాల నియంత్రణ కొరకు సిబ్బంది తీసుకుంటున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుదారులు అందించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని, శాంతి భద్రతల పరిరక్షణ బాధ్యత పోలీసులపై ఉందని పేర్కొన్నారు. నేరాల నియంత్రణ కోసం సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. గ్రామాలలో ఎవరైన అనుమానాస్పద వ్యక్తులు కనబడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఆయన వెంట మంచిర్యాల డీసీపీ అశోక్ కుమార్, ఏసిపి ఆర్ ప్రకాష్, లక్షెట్టిపేట సిఐ అల్లం నరేందర్, మంచిర్యాల రూరల్ సిఐ అశోక్, ఎస్సైలు నరేష్, చంద్రకుమార్, సతీష్ ఉన్నారు.

ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి



నవతెలంగాణ-నిర్మల్

ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల అర్జీలను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రజల సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి, సీఎం ప్రజావాణి దరఖాస్తుల పరిశీలన చేపట్టి ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామీణ ప్రాంతాలలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. ధరణి, రెవెన్యూ, కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు, భూ సమస్యల వంటి అంశాలపై ఫిర్యాదులు అధికంగా వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, డిఆర్‌ఓ గంగయ్య, ఆర్డీఓ రత్నాకళ్యాణి, డీఆర్డీఓ విజయలక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కాలనీవాసుల సౌకర్యార్థం బోరు బావుల ఏర్పాటు



నవతెలంగాణ-జైపూర్

శివ్వారం గ్రామ పంచాయతీ పరిధిలో తాగు నీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందు జాగ్రత్తగా బోరు బావులు ఏర్పాటు చేస్తున్నట్లు స్థానిక కాంగ్రెస్ నాయకులు చల్ల విశ్వంబర్‌రెడ్డి తెలిపారు. సోమవారం వార్డు నెం. 5, 8లో బోరు బావుల తవ్వకాలు ప్రారంభించారు. వేసవిలో నీటి ఇబ్బందులను పరిష్కరించడం కోసం ఎమ్మెల్యే ప్రత్యేక నిధులతో పనులు ప్రారంభించామని తెలిపారు. వార్డు ప్రజల సౌకర్యార్థం రూ.4 లక్షలతో బోరు బావితో పాటు విద్యుత్ మోటార్ ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. నీటి ఇబ్బందులను వివరించిన వెంటనే ఎమ్మెల్యే వివేక్ స్పందించి బోరు బావులను మంజూరు చేసినందున గ్రామ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

వికసిత్ భారత్ మా లక్ష్యం

- బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం
- వచ్చే ఎన్నికల్లో 400పైగా సీట్లు సాధిస్తాం
- కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటే..వాటితో ఒరిగేదేమీలేదు
- కాళేశ్వరం అవినీతిపై కాంగ్రెస్ ఏం చేస్తోంది
- ఆదివాసీ మహిళను రాష్ట్రపతిని చేసిన ఘనత బీజేపీకే దక్కుతుంది
- ఆదిలాబాద్ విజయ సంకల్ప సభలో ప్రధాని నరేంద్ర మోడీ

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

వికసిత్ భారత్ కోసం బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తోందని.. ఇందుకు ఉన్నతాధికారులతో చర్చించి ప్రణాళిక రూపొందిస్తున్నామని..ప్రభుత్వ పాలనలో దేశం అభివృద్ధి చెందుతోందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ఈ పదిహేను రోజుల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని గుర్తుచేశారు. బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమవుతుందని..మరోసారి 400పై చిలుకు లోక్‌సభ స్థానాలు సాధిస్తామని..రానున్న ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు కుటుంబ పార్టీలని..వాటిని నమ్మికోవద్దని దోచుకోవడం, అబద్ధాలు చెప్పడమే వాటి పని అని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని చెప్పిన కాంగ్రెస్ ఇప్పుడేం చేస్తోందని ప్రశ్నించారు. ఆదివాసీ మహిళను రాష్ట్రపతిని చేసిన ఘనత బీజేపీకే దక్కుతుందని..ఆదివాసీల ప్రగతికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. వారి కోసం రూ.26వేల కోట్లతో పీఎం జన్‌మన్ యోజన పథకాన్ని తీసుకొచ్చామని గుర్తు చేశారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని మైదానంలో బీజేపీ విజయ సంకల్ప సభలో భాగంగా వికసిత్ భారత్- మోడీ గ్యారెంటీ పేరుతో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రధాని మోడీ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.

ఇది ఎన్నికల సభ కాదని..వికసిత్ భారత్ కోసం ఇక్కడకు రావడం సంతోషంగా ఉందని వివరించారు. అయోధ్య రామాలయానికి బంగారు దర్వాజ, ధ్వజస్తంభం తెలంగాణ నుంచే వచ్చాయని గుర్తుచేశారు. రాముని ఆశీర్వాదం తెలంగాణ ప్రజలపై ఉంటుందన్నారు. ఈ పదిహేను రోజుల్లో రెండు ఐఐటీలు, ఓ ట్రిపుల్ ఐటీ, ఎయిమ్స్ ప్రారంభించామని చెప్పారు. మోడీ గ్యారెంటీపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోందని..మోడీ గ్యారెంటీ అంటే కచ్చితంగా నెరవేరుతుందని స్పష్టం చేశారు. రాంజీగోండు పేరుతో హైదరాబాదులో వ ం ా ్య జి య ం ఏర్పాటుచేస్తున్నామని..దేశవ్యాప్తంగా ఏడు టెక్స్‌టైల్ పార్కుల్లో తెలంగాణకు ఒకటి కేటాయించామని..సమ్మక్క సారక్క ట్రైబల్ యూనివర్సిటీ, రైతుల కోసం పసుపు బోర్డును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సహకరిస్తుందని, పేదలు, దళితులు, ఆదివాసీల అభివృద్ధికి కృషిచేస్తుందని ఈ పదేండ్లలో 25కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని వ్యాఖ్యానించారు. దేశంలోని 140కోట్ల మంది ప్రజలు నా కుటుంబ సభ్యులేనని వారి కలను నెరవేర్చేందుకు సంకల్పంతో పనిచేస్తున్నానని చెప్పారు. నా జీవితం ప్రజాసేవకే అంకితమని పునరుద్ఘాటించారు. ప్రపంచంలో దేశాన్ని ఉన్నత స్థానంలో నిలబెడుతామని ఇందుకు మీ ప్రేమ, ఆశీర్వాదం కావాలని కోరారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో 17ఎంపీ సీట్లను గెలిపించాలని, మరోసారి బీజేపీని ఆశీర్వదించాలని కోరారు. ఈ పదేండ్లలో బీఆర్ఎస్ అవినీతి, నియంతృత్వ పాలనను చూశామని, కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నెరవేర్చడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్, ఎంపీ సోయం బాపురావు, బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి, జడ్పీ ఛైర్మెన్ రాథోడ్ జనార్ధన్, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, రామారావుపటేల్, పాల్వాయి హరీష్‌బాబు, మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ పాల్గొన్నారు.



ప్రధానికి జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్, వేదికపై జిల్లా నాయకులు

సీపీఐ(ఎం), సీసీఐ సాధన కమిటీ నాయకుల అరెస్ట్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్, రూరల్

జిల్లాలో ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన నేపథ్యంలో సోమవారం సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పూసం సచిన్‌తో పాటు సీసీఐ సాధన కమిటీ కోకన్వీనర్ అరవింద్‌ను స్థానిక పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిని వేర్వేరు పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ అరెస్టులను వారు తీవ్రంగా ఖండించారు. జిల్లాకు వచ్చిన మోడీ జిల్లా ప్రజలు కోరుతున్న సీసీఐ పరిశ్రమ పున: ప్రారంభం, ఆదిలాబాద్ నుండి ఆర్మూర్ వరకు రైల్వేలైన్ మంజూరు, విమానాశ్రయ నిర్మాణం, గిరిజన సెంట్రల్ యూనివర్సిటీ, టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుపై మాట్లాడకుండా వేరే జిల్లాల్లో చేపట్టబోయే అభివృద్ధి పనులను ప్రారంభించారని తెలిపారు. ఓట్లు వేసి గెలిపించిన ఆదిలాబాద్ జిల్లా ప్రజలకు మాత్రం ఎలాంటి అభివృద్ధి ప్రాజెక్టులు మంజూరు చేయకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వ పదేండ్ల కాలంలో జిల్లాలో ఒక్క అభివృద్ధి పని కూడా చేపట్టలేదన్నారు. అయినప్పటికీ జిల్లా ప్రజలు ఎంపీ, ఎమ్మెల్యేలను గెలిపించారని, జిల్లా ప్రజల రుణం తీర్చుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు.





ఉన్నత పాఠశాలలో మాక్ పార్లమెంట్ ఎన్నికలు

నవతెలంగాణ-జైపూర్

భీమారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సోమవారం విద్యార్థులో నమూనా ఎన్నికలు నిర్వహించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల దృష్టితో పాఠశాల విద్యార్థులతో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన తహసీల్దార్ సదానందం, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ ఎన్నికలకు సంబంధించిన ఫామ్ నెం. 6 పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులు రవీందర్, సునిత ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేశారు. రూట్ ఆఫీసర్లుగా విద్యార్థులు విధులు నిర్వర్తించడంతో పాటు పోలింగ్ అధికారులుగా, పోలింగ్ ఏజెంట్లుగా విధులు నిర్వర్తిస్తూ సమర్థవంతంగా ఎన్నికల నిర్వహణ తీరును కళ్లకు కట్టినట్టుగా ప్రదర్శించారు. పాఠశాలలో గుర్తించిన 156 ఓట్లలో 101 ఓట్లు సాధించిన 9వ తరగతి విద్యార్థి రాకేష్ గెలుపొందినట్లు ప్రకటించారు.



గృహజ్యోతి పథకంలో జీరో బిల్లులు



బేల: మండలంలోని గూడ గ్రామంలో సోమవారం గృహజ్యోతి పథకంలో భాగంగా విద్యుత్ వినియోగదారులకు జీరో బిల్లులను కాంగ్రెస్ నాయకులు విద్యుత్ సిబ్బందితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా కిసాన్ సెల్ మండల అధ్యక్షులు గావండే ఘనశ్యామ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన సాగిస్తుందని, ఇది పేదల ప్రభుత్వమని అన్నారు. మేనిఫెస్టోలో పెట్టిన విధంగా గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు కరెంట్ వాడిన వారికి జీరో బిల్లు ఇస్తామన్నారు. అలాగే గ్యాస్ సిలిండర్ రూ.500కే ఇస్తామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం మెగా డీఎస్సీ ద్వారా టీచర్ ఉద్యోగాలు భర్తీ చేయడం జరుగుతుందన్నారు. అతి త్వరలో మిగతా గ్యారెంటీలు కుడా పూర్తి చేసే దిశగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అడుగులు వేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గోడే అవినాష్, గూడ గ్రామ మాజీ ఉప సర్పంచ్ గోడే ధైర్యవాన్, గావండే దత్త, ఠాక్రే సంతోష్, నిక్కం నీలేష్, వైద్య శాంతారామ్ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ

నస్పూర్ : పోలీస్‌స్టేషన్‌ను రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కమిషనర్ ముందుగా పోలీస్‌స్టేషన్ పరిసరాలతో పాటు రిసిప్షన్ సెంటర్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బంది వివరాలు, పని తీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో అధికంగా జరిగే నేరాలను తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవరిస్తూ కేసుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకుని జాప్యం చేయకుండా పరిష్కరించాలన్నారు. పెట్రోలింగ్ పకడ్బందీగా నిర్వహిస్తూ నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు. పోలీసు సిబ్బంది ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా ఉంటూ తమ విధులు క్రమశిక్షణతో నిర్వర్తించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఏసిపి ఆర్.ప్రకాష్, మంచిర్యాల రూరల్ సిఐ అశోక్ కుమార్, సిసిసి నస్పూర్ ఎస్ఐ రవికుమార్ పాల్గొన్నారు.

ఓటు హక్కుపై ఎన్‌వైకెఎస్ అవగాహన సదస్సు

నవతెలంగాణ-కుభీర్

మండల కేంద్రంలో అన్నబావు సాఠే విగ్రహం వద్ద సోమవారం ఎన్‌వైకెఎస్ ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్యేశించి ఛత్రపతి యూత్ అధ్యక్షుడు బోయిడి అభిషేక్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో, ఎన్నికలపై యువతీ యువకుల్లో ఆసక్తి పెంచేందుకు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలన్నారు. అదే విధంగా ఓటు అనే రెండు అక్షరాల పదం దేశ చరిత్రను మార్చేస్తుందని అన్నారు. దీంతో కేంద్ర ప్రభుత్వం జనవరి 25న జాతీయ ఓటరు దినోత్సవంగా ప్రకటించి కుల, మత, జాతి భేదం లేకుండా దేశంలో నివసించే ప్రతి ఒక్క 18 సంవత్సరాలు నిండిన పౌరులకు భారత రాజ్యాంగం ద్వారా 326 ఆర్టికల్ ప్రకారం ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిద్ధం వివేకానంద పొగుల బాబు, కళ్యాణ్, యోగేష్, శ్రీను, దత్తు, రాజు, కిరణ్, ఎంవైకెఎస్ కోఆర్డినేటర్ బంక కిరణ్ గ్రామ యువకులు ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
మంగళవారం | మార్చి 05, 2024 | www.navatelangana.com

సీఎంను కలిసిన శ్రీకాంత్‌రెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని మైదానంలో ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనకు హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎరోడ్రమ్‌లోని హెలిప్యాడ్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని, మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేష్, తెలంగాణ కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డితో పాటు ఏఐసీసీ సభ్యులు నరేష్ జాదవ్, బోథ్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్, అనిల్ కుమార్ శాలువాతో సత్కరించి సాదరంగా స్వాగతం పలికారు.

విపక్షాల అరెస్టులు అప్రజాస్వామికం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్‌లో మోదీ పర్యటన సందర్భంగా విపక్ష నాయకులను అరెస్టులు చేసి గొంతు నొక్కె ప్రయత్నం చేయడాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా ఖండిస్తుందని బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు విజ్జగిరి నారాయణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే తత్వం రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు, ప్రజాస్వామిక విలువలకి తిలోదాకాలిచ్చి మోదీ ప్రభుత్వం నియంతపాలన కొనసాగిస్తున్నదని పేర్కొన్నారు. మోదీ పర్యటన సందర్భంగా అరెస్టుల పర్వానికి తెరలేపడం అంటే ప్రశ్నించే గొంతులకు, వారు లేవనెత్తె ప్రజా సమస్యల పరిష్కారం పట్ల సమాధానం చెప్పలేని స్థితిలో ఉన్నాడనటానికి నిదర్శనమన్నారు. ఆదిలాబాద్ ప్రాంత ప్రజలు అడుగుతున్నది ఏమిటీ మీ ప్రియ మిత్రుడు ఆదానికి మీరు దోచిపెట్టిన ఆస్తిలో సగం ఇవ్వమని అడగడం లేదని తెలిపారు. 1984లో ప్రారంభమైన సీసీఐ 1998లో ఆనాటి బీజేపీ ప్రభుత్వం వాజపేయ్ ప్రధానిగా ఉన్న సమయంలో మూతవేశారు. మీరు అనేకసార్లు సీసీఐ పేరు చెప్పి ఓట్లు వేయించుకొని ఆదిలాబాద్ ఎంపీ, తర్వాత ఎమ్మెల్యేగా గెలిచారని మీరు ఇచ్చిన హామీని అమలు చేయాలనీ డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. కేంద్రం పరిధిలోని సీసీఐ పునరుద్దరణ, ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ లైన్ నిర్మాణం, ఆదిలాబాద్‌లో విమానాశ్రయం, కాటన్ ఆదారిత పరిశ్రమ, ఉట్నూర్‌లో గిరిజన యూనివర్సిటీ డిమాండ్ పరిష్కారం చేయాలనీ అడిగినందుకు విపక్ష నాయకులను అరెస్ట్ చేయడం సిగ్గు చేటన్నారు. అరెస్టులు చేసిన నాయకులను వెంటనే విడుదల చేయాలని పేర్కొన్నారు.

ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా మోడీ పర్యటన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మరోసారి ఆదిలాబాద్ ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా ప్రధాని మోడీ పర్యటన జరిగిందని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీసీఐ పరిశ్రమతో పాటు ఆదిలాబాద్ టు ఆర్మూర్ రైల్వే లైన్, విమానాశ్రయ ఏర్పాటుతో పాటు, టెక్స్‌టైల్ పార్క్ నిర్మాణంపై ఎంతగానో ఎదురుచూస్తున్న ఆదిలాబాద్ ప్రజానీకానికి మరోసారి నిరాశ నిస్పృహలకు గురిచేశారన్నారు. ఇది ముమ్మాటికి సంకల్ప సభ కాదని ప్రజలను నిరాశపర్చిన సభ అని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల ముందు ఓట్ల కోసమే ఈ సభ ఏర్పాటు చేశారన్నారు. జిల్లాపై మోడీకి కనీస కనికరం లేకపోవడం ఈ సభ నిదర్శనమని పేర్కొన్నారు.

రక్తదానం చేసి ఉదారత చాటుకున్న కనక మల్కు



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలంలోని మామిడిగూడ ఆశ్రమ పాఠశాల విద్యార్థిని రక్త హీనతతో బాధపడుతుండగా విషయం తెలుసుకున్న తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఉట్నూర్ మండలాధ్యక్షుడు కనక మల్కు రక్తదానం చేసి ఉదారతను చాటుకున్నాడు. మానవసేవే మాధవ సేవని అన్నారు. అన్ని దానాల కన్నా రక్తదానం మిన్న అంటూ మానవత్వం చాటుకున్నారు.

మోడీ ప్రభుత్వాన్ని ఓడించాలి



నవతెలంగాణ-ఖానాపూర్

మోడీ ప్రభుత్వం రైతు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ కార్పొరేట్లకు సేవ చేస్తున్నదని వచ్చే ఎన్నికల్లో మోడీ ప్రభుత్వాన్ని ఓడించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం ఖానాపూర్‌లో జరిగిన సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం పది సంవత్సరాలుగా రైతు, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని అన్నారు. కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని అన్నారు. ఆదిలాబాద్ వచ్చిన మోడీ ప్రజల డిమాండ్‌లు ఆదిలాబాద్ ఆర్మూర్ రైల్వేలైన్ ఎయిర్‌పోర్టు గిరిజన యూనివర్సిటీ, సీసీఐల గురించి పట్టించుకోకుండా ప్రజలను అవమానపరిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి జే.రాజు, ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేష్, జిల్లా నాయకులు మంచికంటి లక్ష్మణ్, వెంకటేష్, రాజేష్, స్వామి, ప్రసాద్, శేఖర్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సభ నేపథ్యంలో సోమవారం పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. సభస్థలి ఇందిరాప్రియదర్శిని స్టేడియంలో రూట్‌లో వాహనాలను పోలీసులు అనుమతించలేదు. కలెక్టర్ చౌక్‌లో పోలీసులు వాహనాలు అటు వైపు రాకుండా చూశారు. అయితే ఇంటర్ పరీక్షల నేపథ్యంలో హాల్ టికెట్ చూపించిన విద్యార్థులకు పంపించారు. డీఐఈఓ రవీందర్ పోలీసులకు సహకరిస్తు ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు సూచనలు చేశారు. ఇది వరకే పోలీసులు, అధికారులు పరీక్ష కేంద్రానికి గంట ముందే చేరుకోవాలని సూచించారు. దానికి అనుగుణంగానే విద్యార్థులు ఎనిమిది గంటల నుంచే కేంద్రాలకు చేరుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పోలీసులు ఆయా రూట్లలో ఆకాంక్షలు విధిస్తు ప్రత్యామ్న రూట్లను తెలియజేశారు. దీంతో ప్రశాంత వాతావరణంలో ఇంటర్ పరీక్ష జరిగింది.

శ్రీలక్ష్మి నర్సింహస్వామి దేవస్థాన పాలక మండలి సమావేశం

నవతెలంగాణ-దిలావర్‌పూర్

మహా శివరాత్రి జాతరను పురస్కరించుకుని మండలంలోని కాల్వ గ్రామానికి చెందిన ప్రసిద్ధ లక్ష్మీ నర్సింహ స్వామి పుణ్య క్షేత్రంలో ఆలయ చైర్మెన్ ఉజరం మహేష్ అధ్యక్షతన సోమవారం శ్రీలక్ష్మి నర్సింహ స్వామి దేవస్థాన ఆలయ కమిటీ పాలక మండలి సమావేశం నిర్వహించారు. శివరాత్రి జాతర సందర్భంగా ఆలయ పరిసరాల్లోని ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం భక్తుల సౌకర్యార్థం పార్కింగ్, దుకాణ సముదాయాలు తదితర అంశాలపై తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు పూదరి శివ, ఏలేటి ప్రీతంరెడ్డి, పోద్దుటూరి శ్రీనివాస్‌రెడ్డి, గుమ్ముల చిన్న నర్సయ్య, అర్చకులు రాము, శ్రీనివాస్, వెంకటేష్, జూనియర్ అసిస్టెంట్ మాధవరావు, సిబ్బంది స్వామి పాల్గొన్నారు.

ప్రజలకు పూర్తి సహకారం అందిస్తాం : మంత్రి సీతక్క

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



మంత్రి సీతక్కను సన్మానిస్తున్న కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు

కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు పూర్తి సహకారం అందిస్తామని మంత్రి సీతక్క అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ప్రధాని మోడీ పర్యటన సందర్భంగా జిల్లాకు వచ్చిన మంత్రి సీతక్క మావల మండల కేంద్రంలోని తెలంగాణ కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచ్ శ్రీకాంత్‌రెడ్డి ఇంటికి మర్యాదపూర్వకంగా వచ్చారు. ఈ సందర్భంగా తేనేటి విందులో పాల్గొన్న ఆమె జిల్లాలో పలు రాజకీయ పరిస్థితులపై శ్రీకాంత్‌రెడ్డితో సుదీర్ఘంగా చర్చించారు. కష్టపడి అంకితభావంతో పార్టీలో పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందని, రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం అందరు కలిసి అన్నదమ్ముల్లా ముందుకు సాగాలన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని ముందుకు తీసుకు వెళ్లడంతో పాటు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను అర్హులైన ప్రతి ఒక్కరికి చేరవేయడంలో పూర్తి బాధ్యత వహించాలని కోరారు. ఇందుకు బోరంచు శ్రీకాంత్‌రెడ్డి అధిష్టానం సూచన మేరకు క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా చూడటంతో పాటు పార్టీ నిర్ణయాలకు కట్టుబడి పని చేస్తామని వెల్లడించారు. మంత్రి సీతక్కతో ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖా శ్యాం నాయక్, నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, శ్రీకాంత్‌రెడ్డి నివాసానికి వచ్చారు. అంతకుముందు తన నివాసానికి వచ్చిన మంత్రి సీతక్కను శ్రీకాంత్ రెడ్డి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

'ఎన్నికల ప్రచారానికి తప్ప జిల్లా ప్రజలకు ఒరిగిందేమీ లేదు'

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బోథ్ అసెంబ్లీ ఇన్‌చార్జీ ఆడే గజేందర్

నవతెలంగాణ-నేరడిగొండ

నాలుగు దశాబ్దల తర్వాత ఆదిలాబాద్ జిల్లాకు ప్రధానమంత్రి పర్యటన ఉండటంతో రాజకీయ ప్రయోజనం కంటే ప్రజాప్రయోజనాలే ఉంటాయని ఆశించిన జిల్లా ప్రజలకు నిరాశే మిగిలిందని, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. సోమవారం నేరడిగొండ మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆదిలాబాద్ పార్లమెంటు పరిధిలో నలుగురు ఎమ్మెల్యేలు ఒక ఎంపీ ఉండి, ఆదిలాబాద్ జిల్లా న్యాయంగా దక్కాల్సిన ఆదిలాబాద్, నిర్మల్, ఆర్మూర్ రైల్వే లైన్ ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న రైల్వే లైన్‌లకు అండర్ గ్రౌండ్ బ్రిడ్జిలు, ఫ్లై ఓవర్లు, గిరిజన విశ్వవిద్యాలయం వెనుకబడిన జిల్లాలకు కేటాయించే ప్రత్యేక నిధులు, ఆదిలాబాద్ జిల్లాకు ఎయిర్‌పోర్ట్, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, ప్రధానమంత్రి పర్యటన ద్వారా వస్తాయని, అనుకుంటే కేవలం రాజకీయ ప్రచారానానికి ఉపయోగపడుతుందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ఆదిలాబాద్ జిల్లా ప్రజలు బీజేపీ నాయకులకు కపట ప్రేమను గమనించి, కాంగ్రెస్ ఆదరించాలని ఆదిలాబాద్ జిల్లాను అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ బొడ్డు గంగారెడ్డి, వైస్ చైర్మెన్ ఆడే వసంతరావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కిషన్ చవాన్, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రవుల్ చందర్‌రెడ్డి, షేక్ అబుద్ పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి

నవతెలంగాణ-తాంసి



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న అసెంబ్లీ ఇన్‌చార్జీ ఆడే గజేందర్

సీసీ రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని బోథ్ నియోజక కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రానికి రూ.12లక్షల ప్రత్యేక నిధులతో నిర్మించే సీసీ రోడ్లు పనులకు జెడ్పీటీసీ రాజు, ఎంపీపీ మంజుల శ్రీధర్‌రెడ్డి, బోథ్ మార్కెట్ కమిటీ చైర్మెన్ గంగారెడ్డితో పాటు మండల నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి గ్రామానికి సీసీ రోడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. బోథ్ నియోజకవర్గానికి ఇన్‌చార్జ్ మంత్రి నిధులు రూ.7కోట్లు నిధులు కేటాయించారని అన్నారు. కార్యకర్తలు తమ గ్రామాల్లో చెడ్డ పేరు రాకుండా, నాణ్యతతో పనులు చేపట్టాలని అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం ప్రతి నాయకులు, కార్యకర్త కష్టపడి పనిచేసి గెలిపించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామన్న యాదవ్, కృష్ణ, నరేష్, నారాయణ, గంగారెడ్డి, చిన రాంరెడ్డి, రాకేష్, వెంకట్ రెడ్డి ఉన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

- తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావు

నవతెలంగాణ-ఉట్నూర్

దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో అధికారిక పర్యటనకు వస్తున్న సందర్భంగా ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షులు గోడం గణేష్, తుడుందెబ్బ నాయకులను రాత్రి మూడు గంటలకు పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేసి తమ కస్టడీలో ఉంచుకోవడంపై తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షులు పుర్క బాపురావు తీవ్రంగా మండిపడ్డారు. సోమవారం పుర్క బాపురావు మాట్లాడుతూ ఆదివాసీ హక్కుల చట్టాలు అమలుకై ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతున్నటువంటి తుడుం దెబ్బ సంఘం నాయకులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భయపడి ముందుగా అరెస్టు చేయడం సిగ్గుచేటని, ఇంతటి దుర్మార్గమైన చర్యలు ఎక్కడ కూడా లేదన్నారు. ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు తుడుం దెబ్బ సంఘ నాయకులకు అక్రమ అరెస్టు చేసి ప్రభుత్వం రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా అక్రమ అరెస్టులను నిలిపివేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ప్రధాని మోడీ సభకు బయలుదేరిన బీజేపీ నాయకులు

నవతెలంగాణ-లక్ష్మణచాంద

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రధాని మోడీ బహిరంగ సభకు మండల బీజేపీ నాయకులు తరలివెళ్లారు. రానున్న రోజుల్లో పార్లమెంట్ ఎన్నికలలో పార్లమెంటు స్థానాన్ని గెలిచి కేంద్రంలోకి మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమని, బీజేపీ నాయకులు పేర్కొన్నారు. సభకు వెళ్లిన వారిలో బీజేపీ నాయకులు భూపాల్‌రెడ్డి, అద్వాల రమేష్, సురుకుంటి ముత్యంరెడ్డి, మండల బీజేపీ నాయకులు ఉన్నారు.

మరోసారి మోసం చేసిన ప్రధాని : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మరోసారి జిల్లా ప్రజలను ప్రధాని మోడీ మోసం చేశారని సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ప్రజలు ఎంతగానో ఎదురుచూస్తున్నా సీసీఐ పున: ప్రారంభం, ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ రైల్వే లైన్, విమానశ్రయం, గిరిజన యూనివర్సిటీ, టెక్స్‌టైల్ పార్క్ లాంటి ప్రాజెక్టుల్లో ఏదో ఒక్కటైనా మంజూరు చేయకపోతాడాని ఆశతో ఎదురు చూసిన జిల్లా ప్రజలకు ప్రధాని నిరాశ మిగిల్చారని పేర్కొన్నారు. ఈ చర్య జిల్లా ప్రజలను అవమాన పర్చడమేనని సీపీఐ(ఎం) భావిస్తుందని పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధి పట్టని బీజేపీని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిస్తున్నామని పేర్కొన్నారు.

7న నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రయివేటు రంగంలో ఉద్యోగాలను కల్పించుటకు ఈ నెల 7న సాత్నాల క్వార్టర్స్ వద్దనున్న జిల్లా ఉపాధి కార్యాలయంలో వివిధ ప్రయివేటు కంపెనీలో ఉద్యోగాల ఎంపికకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి మిల్కా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన వారికి రూ.12వేల 500 నుంచి రూ.15వేల వరకు జీతభత్యంతో పాటు ఇతర అలవెన్సులు ఇవ్వబడతాయన్నారు. వయస్సు 19 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాల్లోపు యువతీ, యువకులు అర్హులని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల జిల్లా నిరుద్యోగ యువత తమ బయోడేటా విద్యార్హతల సర్టిఫికెట్‌తో పాటు ఆధార్ కార్డు, పాన్‌కార్డు జిరాక్స్ కాపీలతో జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు హాజరుకావాలని సూచించారు. వివరాల కొరకు 7659978443, 8019537030 నెంబరును సంప్రదించాలని పేర్కొన్నారు.

చిన్నారులకు పోలియో తప్పకుండా వేయించాలి

నవతెలంగాణ-నార్నూర్

చిన్నారులకు పల్స్‌పోలియోను తప్పకుండా వేయించాలని డాక్టర్ రాంబాబు అన్నారు. 0 నుంచి ఐదు సంవత్సరాల్లోపు ఉన్న చిన్నారులకు తల్లిదండ్రులు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని అన్నారు. సోమవారం రెండో రోజు పోలియో చుక్కల కార్యక్రమంలో భాగంగా మండలంలోని గుంజాల గ్రామంలో ఇంటింటా తిరుగుతూ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. మండలంలోని 35 పోలియో బూత్ ఏర్పాటు చేసి చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్ఓ లక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్లు సతవ్వ, చౌహాన్ చరణ్‌దాస్, వైద్య సిబ్బంది హిమబిందు, ఈశ్వరి, సుశీల, సింధు, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

నేటి నుంచి సోయా కొనుగోళ్ల పున: ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఇటీవల తాత్కాలికంగా నిలిపివేసిన సోయాబీన్ కొనుగోళ్లను ఈనెల 5 నుంచి తిరిగి పున:ప్రారంభం చేపడుతున్నట్లు ఆదిలాబాద్ మార్క్‌ఫెడ్ మేనేజర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదిలాబాద్, జైనథ్, ఇచ్చోడలో సోయాబీన్ కొనుగోలు కనీస మద్దతు ధర రూ.4వేల 600తో ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని జిల్లా రైతులు గమనించి, తమ సోయా సరుకును శుభ్ర పర్చి తేమ 12శాతంలోపు ఉండే విధంగా ఆరబెట్టి తీసుకురావాలని సూచించారు. జిల్లా కొనుగోలు కమిటీ ఆదేశానుసారంగా మండల వ్యవసాయ అధికారి లేదా వ్యవసాయ విస్తీర్ణ అధికారితో పంట ధృవీకరణ పత్రము సేకరించి తమకు సంబంధించిన మార్కెట్ యార్డ్‌కు తీసుకువచ్చి అమ్మి మద్దతు ధర రూ.4వేలు 600 పొందవచ్చని పేర్కొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ



నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలో సోమవారం ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.50లక్షల నిధులతో సీసీ రోడ్డు, నిర్మాణానికి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మరింత మెరుగైన పాలన అందించాలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని అన్నారు. మన ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని అన్నారు. వివిధ గ్రామాలకు మంజూరైన సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్లు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్ సజన్, బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి చేయూత



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని మునిపల్లి గ్రామానికి చెందిన ముండ్ల మమత కుటుంబానికి జీవనోపాధి రీత్యా కిరాణా షాపు ప్రారంభించడానికి రూ.20వేల విలువ చేసే కిరాణా సరుకులు, స్టేషనరిని వరల్డ్ విజన్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు సోమవారం అందజేశారు. నిరుపేద కుటుంబాల ఉన్నతికి కృషి చేస్తున్న వరల్డ్ విజన్ సంస్థ సేవలను పలువురు గ్రామస్తులు, మండల వాసులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ హనుమన్న, గ్రామ నాయకులు శేఖర్‌రెడ్డి, రమేష్, గ్రామ సమన్వయ కమిటీ ప్రెసిడెంట్ అశోక్, వరల్డ్ విజన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో చదువుకోవాలి



నవతెలంగాణ-ఉట్నూర్

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదువుకోవాలని మంత్రి సీతక్క అన్నారు. సోమవారం ఉట్నూర్ నుంచి ఆదిలాబాద్ వెళ్తూ మార్గమధ్యంలో ఉన్న యెందా ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత బాలుర పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో నేరుగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు గొప్ప లక్ష్యాన్ని పెట్టుకుని, ఆ దిశగా ఉన్నత చదువులు చదువుకొని లక్ష్యాన్ని చేరుకోవాలని అన్నారు. అనంతరం పాఠశాల తరగతి గదులు తిరుగుతూ సౌకర్యాలను పరిశీలించారు. పరీక్షలు సమీపిస్తునందున విద్యార్థుల చదువు విషయంలో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజన విద్యార్థులకు 2024-25 విద్యా సంవత్సరానికి గాను హైదరాబాద్ బేగంపేట్, రామంతాపూర్ పబ్లిక్ స్కూల్లో ఒకటో తరగతి ప్రవేశానికి దరఖాస్తులు అహ్వానిస్తున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ, ఉపసంచాలకుడు దిలీప్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అర్హులైన గిరిజన బాలికలకు 3, బాలురులకు 3 సీట్లు కేటాయించామని పేర్కొన్నారు. 1 జూన్ 2017 నుంచి 31 మే 2018 మధ్య జన్మించి, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాలలో రూ.లక్ష యాభై వేలు, పట్టణాల్లో రూ.రెండు లక్షలు మించరాదని పేర్కొన్నారు. ఈనెల 4 నుంచి 11వ తేదీ వరకు దరఖాస్తులు గిరిజన సంక్షేమ శాఖ డీడీ కార్యాలయంలో అందజేయాలని కోరారు. ఈనెల 14న డ్రా ద్వారా విద్యార్థుల ఎంపిక ఉంటుందని తెలిపారు.

దాబా(కె) గ్రామంలో వంద శాతం పోలియో

నవతెలంగాణ-ఇచ్చోడ

పోలియో రహిత సమాజం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆదివారం 0-5సంవత్సరాల్లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. సోమవారం ఇచ్చోడ మండలంలోని దాబా(కె)గ్రామంలో ఇంటింటికి వెళ్లి 0-5సంవత్సరాల్లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేసిన వారి ఇంటికి నంబర్లు వేశారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం, అంగన్‌వాడీ టీచర్, ఆశా కార్యకర్త మాట్లాడుతూ గ్రామంలో వంద శాతం పోలియో చుక్కలు వేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు గైయికాంబ్లే గణేష్ పాల్గొన్నారు.

ఇంటింటికి వెళ్లి పిల్లలకు పోలియో చుక్కలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పోలియో మహమ్మారిని దేశం నుంచి పారదోలేందుకు నిర్వహించిన పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమం జిల్లాలో 2వ రోజు కొనసాగుతోంది. తొలిరోజు సెంటర్‌లలో పుట్టిన బిడ్డ నుంచి ఐదేండ్ల పిల్లల వరకు పోలియో చుక్కలు వేయగా, 2వ రోజు సోమవారం ఇంటింటికి వెళ్లి చుక్కలు వేశారు. ఇందులో భాగంగానే భుక్తాపూర్‌లోని 7వ అంగన్‌వాడీ కేంద్రం టీచర్ అనుముల్‌వార్ కవిత ఆధ్వర్యంలో కాలనీలోని ఇంటింటికి వెళ్లి, పిల్లలకు పోలియో చుక్కల మందు వేశారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజన ప్రజల అందజేసిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని డీడీ దిలీప్ కుమార్ అన్నారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి సమస్యల పరిష్కారానికి వచ్చిన గిరిజనుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ ప్రజావాణిలో ఏపీఓ కనక భీంరావు, ఏడీఎంహెచ్ఓ కుమ్ర బాలు, ఏఓ రాంబాబు, ఏపీఓ పీవీటీజీ ఆత్రం భాస్కర్, పీహెచ్ఓ సందీప్, జేడీఎం నాగభూషణం, ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీఓ ప్రవీణ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌పై శిక్షణ

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సోమవారం కమ్యూనికేషన్ స్కిల్స్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ నైపుణ్య అకాడమీ(టాస్క్) ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఈ శిక్షణ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డి.లక్ష్మీనరసింహం మాట్లాడుతూ విద్యార్థులు డిగ్రీ స్థాయిలోనే వివిధ అంశాలపై నైపుణ్యాలు కలిగి ఉండాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ రాజు, టాస్క్ కోఆర్డినేటర్ టి.దత్తాత్రేయ, శిక్షణ నిపుణులు సాయికుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎంఈఓ కార్యాలయంలో దొంగతనం

నవతెలంగాణ-దహెగాం



మండల కేంద్రంలోని స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఆదివారం రాత్రి దొంగతనం జరిగింది. సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల ఎంఈఓ కార్యాలయానికి ఆరు కంప్యూటర్లు వచ్చాయి. వీటిలో రెండు కంప్యూటర్లను గుర్తు తెలియని వ్యక్తులు తలుపులు పగులగొట్టి దొంగలించారన్నారు. సోమవారం ఉదయం విధులకు హాజరైన సిబ్బంది తలుపులు తెరిచి ఉండడంతో ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. తీరా లోపల చూసేసరికి రెండు కంప్యూటర్లు దొంగలించినట్టు గుర్తించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు సీసీఓ రాజేష్ తెలిపారు.

ప్రశాంతంగా మున్సిపల్ చైర్మెన్, వైస్ చైర్మెన్ల ఎన్నిక

- చైర్మెన్‌గా షాహిన్‌సుల్తానా, వైస్ చైర్మెన్‌గా ఎస్ రాజేందర్‌లు ఏకగ్రీవం



చైర్మెన్‌గా ఎన్నికైన షాహిన్‌సుల్తానా



వైస్ చైర్మెన్‌గా ఎన్నికైన ఎస్ రాజేందర్



అనుకూలంగా చేతులు ఎత్తుతున్న కౌన్సిలర్లు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మున్సిపల్ చైర్మెన్, వైస్ చైర్మెన్‌లను సోమవారం ఎన్నుకున్నారు. చైర్మెన్‌గా 19వ వార్డు కౌన్సిలర్ షాహిన్‌సుల్తానా, వైస్ చైర్మెన్‌గా 15వ వార్డు కౌన్సిలర్ స్వామిశెట్టి రాజేందర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత మున్సిపల్ చైర్మెన్ సద్దాం హుస్సేన్, వైస్ చైర్మెన్ రాచకొండ గిరీష్‌కుమార్‌లపై డిసెంబర్ 20న మెజార్టీ మున్సిపల్ కౌన్సిలర్లు అవిశ్వాసం ప్రకటించి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. దీనితో జనవరి 20న మున్సిపల్ కార్యాలయంలో అవిశ్వాస సమావేశం నిర్వహించగా, అవిశ్వాసం నెగ్గింది. సోమవారం నూతన మున్సిపల్ చైర్మెన్, వైస్ చైర్మెన్‌ల ఎన్నిక కోసం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో సమావేశం నిర్వహించారు. ఎన్నికల అధికారిగా కాగజ్‌నగర్ ఆర్డీఓ కె.సురేష్ వ్యవహరించారు. చైర్మెన్‌గా షాహిన్ సుల్తానా పేరును మూడో వార్డు కౌన్సిలర్ శివప్రసాద్ ప్రతిపాదించగా, 23వ వార్డు కౌన్సిలర్ బి.విద్యావతి బలపర్చారు. వైస్ చైర్మెన్‌గా స్వామిశెట్టి రాజేందర్ పేరును ఆరో వార్డు కౌన్సిలర్ జయచందర్ ప్రతిపాదించగా, ఎనిమిదో వార్డు కౌన్సిలర్ బంక శివప్రసాద్ బలపర్చారు. సమావేశానికి 30 మంది కౌన్సిలర్లు హాజరు కావాల్సి ఉండగా, 26 మంది హాజరయ్యారు. చైర్మెన్‌కు అనుకూలంగా మొత్తం 26 మంది కౌన్సిలర్‌లు అనుకూలంగా చేతులు ఎత్తారు. అనంతరం ఐదుగురు కౌన్సిలర్లు సమావేశం హాలు నుండి వెళ్లిపోయారు. వైస్ చైర్మెన్ ఎన్నిక సమయంలో సమావేశం హాలులో 21 మంది మాత్రమే ఉండగా, వీరు వైస్ చైర్మెన్‌కు అనుకూలంగా చేతులు లేపారు. ఎన్నిక సందర్భంగా మున్సిపల్ కార్యాలయం వద్ద టౌన్, రూరల్ సీఐలు శంకరయ్య, నాగరాజుల ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నిక అనంతరం బీఆర్ఎస్ వర్గీయులు సంబరాలు జరుపుకున్నారు. టపాసులు పేల్చారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

రెండు వర్గాలకు సమ ప్రాధాన్యం

కాగా గతంలో మున్సిపల్ చైర్మెన్, వైస్ చైర్మెన్‌గా రెండు వర్గాలకు అప్పటి ఎమ్మెల్యే కోనప్ప ప్రాధాన్యమిచ్చారు. ఇపుడు కూడా ఆ రెండు వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చి పదవులు కల్పించారు. గతంలో మున్సిపల్ చైర్మెన్‌గా మైనార్టీ వర్గానికి చెందిన సద్దాం హుస్సేన్, వైస్ చైర్మెన్‌గా వైశ్య వర్గానికి చెందిన రాచకొండ గిరీష్‌కుమార్‌లు కొనసాగారు. వీరిద్దరిని అవిశ్వాసం ద్వారా తొలగించిన అనంతరం మళ్లీ ఆ రెండు వర్గాలకే ప్రాధాన్యతనిచ్చి ఆయా వర్గాలలో అసంతృప్తి రాకుండా జాగ్రత్త పడ్డారు. ఇపుడు మైనార్టీ వర్గానికే చెందిన షాహిన్ సుల్తానాను చైర్మెన్‌గా, వైశ్యవర్గానికి చెందిన రాజేందర్‌ను వైస్ చైర్మెన్‌గా ఎన్నుకున్నారు.

పౌష్టికాహారం అందించడంపై దృష్టి సారించాలి

నవతెలంగాణ-కెరమెరి

అంగన్‌వాడీ కేంద్రాల్లో పెట్టాల్సింది సీసీ కెమెరాలు కాదని, పెట్టాల్సింది పౌష్టికాహారమని సీఐటీయూ మండల కన్వీనర్ కూటికల ఆనందరావు అన్నారు.సోమవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఏడాది కాలంగా అద్దెగదిలో ఉంటున్న అంగన్‌వాడీ కేంద్రాలకు నేటి వరకు బాకాయిలు చెల్లించలేదని పేర్కొన్నారు. కేంద్రాల్లో పిల్లలకు సరైన ఆట వస్తువులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనేక కేంద్రాలకు సొంత భవనాలు లేవన్నారు. పిల్లలకు గర్భిణీలకు బాలింతలకు నాణ్యమైన పౌస్టికహారం అందించడంపై దృష్టి సారించాలన్నారు. ఐసీడీఎస్‌ను బలోపేతం కోసం సరిపడా డబ్బులు కేటాయించడం గాలికొదిలి సీసీ కెమెరాల అవసరమేముందని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

మద్యం మత్తులో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-కెరమెరి

మద్యం మత్తులో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం మండలంలోని కొత్తగూడ(కోరారి) గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై గుంపుల విజయ్ కుమార్, మృతుడి సోదరుడు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడ గ్రామానికి చెందిన మడావి ఆనంద్ రావు(28) జోడేఘాట్ గ్రామానికి చెందిన మహిళకు తొమ్మిదేండ్ల క్రితం వివాహం అయింది. మార్చి 1న భార్య భర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో ఆనంద్ రావు భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో ఆనంద్ రావు మస్థాపం చెందాడు. సోమవారం మద్యమత్తులో గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి సోదరుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుటుంబాన్ని ఆదుకోవాలని కలెక్టర్‌కు వినతి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమ కుటుంబాన్ని ఆదుకోవాలని తెలంగాణ సాంస్కృతిక సారధిలో డప్పు వాయిద్య కళాకారునిగా పనిచేసే వ్యక్తి చెందిన శ్రీరాములు సమ్మయ్య కుటుంబ సభ్యులు కలెక్టర్‌ను కోరారు. జిల్లాకు కొత్తగా వచ్చిన కలెక్టర్ వెంకటేష్ దౌత్రేని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కళాకారుని భార్య రజిత మాట్లాడుతూ జిల్లాలో తెలంగాణ సాంస్కృతిక సారధిలో డప్పు వాయిద్య కళాకారునిగా విధులు నిర్వహిస్తున్న తన భర్త శ్రీరాముల సమ్మయ్య ఇటీవల ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు చేయూతలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని, ఉపాధి కల్పించాలని కోరింది. కలెక్టర్ స్పందిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు మోహన్ నాయక్, గోడిసెల బాపు, కుమార్, గుండశిరీష కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ



నవతెలంగాణ-సిర్పూర్(టి)

కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలతో పాటు మారుమూల గ్రామాల్లో, పట్టణాల్లో రోడ్డు నిర్మాణ పనులు చేపడుతుందని, అందులో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చౌదరి తిరుపతి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ టవర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేద వారి సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. గ్రామాలు, పట్టణాల్లో ఉన్న పలు వీధుల్లో రోడ్డు నిర్మాణ పనులు చేపడుతుందని, అలాగే మరికొన్ని గ్రామాలు, కాలనీల్లో రోడ్డు నిర్మాణ పనులు చేపడుతామన్నారు. ఆయన వెంట మండల ఉపాధ్యక్షుడు లెండుగురె శంకర్, గౌరవ అధ్యక్షుడు రమేష్‌గౌడ్ ఉన్నారు.

7 నుంచి కబడ్డీ పోటీలు

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలో ఈ నెల 7, 8 తేదీల్లో భగత్‌సింగ్ 93వ జయంతి సందర్భంగా కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్టు డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గెడం టికానంద్, గొడిసెల కార్తీక్, జిల్లా ఉపాధ్యక్షుడు చాప్లె పురుషోత్తం తెలిపారు. ఈ పోటీలో మొదటి బహుమతి రూ.7 వేలు, రెండో బహుమతి రూ.5 వేలతో పాటు షీల్డులు అందిస్తామన్నారు. పోటీలో పాల్గొనేఆసక్తి గల క్రీడాకారులు రూ.500 ఎంట్రీ చెల్లించాలన్నారు. మరిన్ని వివరాల కోసం సెల్ నంబర్ 630233282, 8919069178 సంప్రదించాలన్నారు. క్రీడాకారులందరు సహకరించి విజయవంతం చేయాలని కోరారు.

మోడీ సభకు తరలిన శ్రేణులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఆదిలాబాద్‌కు వచ్చిన నేపథ్యంలో ఆయన సభకు జిల్లా నుండి పెద్ద ఎత్తున శ్రేణులు తరలి వెళ్లారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు బోనగిరి సతీష్ బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు విశాల్ ఆధ్వర్యంలో శ్రేణులు ఆదిలాబాద్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి బయలుదేరారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయనుందన్నారు. మోడీ రాష్ట్రంలోని అనేక రహదారులు మంజూరు చేయనున్నారని తెలిపారు. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు అమృత్ పాల్ కౌర్, చంద్రకుమార్, విద్యాసాగర్, రాజ్ కుమార్, ధీరజ్, వినయ్, చరణ్ తేజ, సీనియర్ నాయకులు దండ నాయకుల చంద్రకాంత్, సోమ మదనయ్య, పసునూరి తిరుపతి పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌కు అధిక కేసులు వచ్చేలా చూడాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. యువరాజ్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యే విధంగా కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. యువరాజ్ అన్నారు. ఈ నెల 16న జరగనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంపై సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా న్యాయస్థాన భవన సముదాయంలో జిల్లా జూనియర్ న్యాయమూర్తి అనంతలక్ష్మితో కలిసి పోలీసు, అగ్నిమాపక శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 16న జరగనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో రాజీ మార్గం ద్వారా అధిక సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యే విధంగా కృషి చేయాలని సూచించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి కక్షిదారులకు అవగాహన కల్పించాలని, కేసులను రాజీకి వచ్చే విధంగా చేయడం ద్వారా కక్షిదారులు సమయం, డబ్బులు ఆదా చేసుకోవచ్చని తెలియజేయాలన్నారు. సంబంధిత స్టేషన్ల వారీగా కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సైబర్ క్రైమ్ కేసులు అధిక సంఖ్యలో రాజీ చేయడంతో పాటు అందించిన వారి సంతకాలు తప్పనిసరిగా తీసుకోవాలని, కేసుల పరిష్కారంలో రాజీమార్గమే రాజ మార్గమన్నారు. ఈ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆసిఫాబాద్ ఎస్‌డీపీఓపీ సదయ్య, జైనూర్, వాంకిడి, రెబ్బెన సీఐలు కె. అంజయ్య, బి. శ్రీనివాస్, ఎన్. చిట్టిబాబు, అగ్నిమాపక శాఖ అధికారి కె. రవీందర్, ఆసిఫాబాద్ డివిజన్ ఎస్‌హెచ్ఓలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణి సమస్యలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని దీనికి వచ్చే దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) దాసరి వేణు అన్నారు. సోమవారం ప్రజావాణిలో భాగంగా అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ఆయా గ్రామాలు, మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

గొప్ప పోరాట యోధుడు కుమురం భీం

- నూతన కలెక్టర్ వెంకటేష్ దౌత్రే

నవతెలంగాణ-కెరమెరి

గొప్ప పోరాట యోధుడు కుమురం అని నూతన జిల్లా కలెక్టర్ వెంకటేష్ దౌత్రే అన్నారు. సోమవారం మండలంలోని ఆదివాసుల అమరుడు భీం పురిటిగడ్డ జోడేఘాట్‌ను సందర్శించారు. భీం నిలువెత్తు విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన సమాధి వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదివాసుల అస్తిత్వాన్ని, అటవీ సంపదను, నమ్ముకున్న భూమిని, నీటిని తమదేనని జల్ జంగల్ జమీన్ నినాదంతో పోరాటం చేసి నిజాం నవాబుకు ఎదురెల్లిన గొప్ప పోరాట యోధుడని కొనియాడారు. భీం పోరాట స్ఫూర్తితో గిరిజనులు చైతన్యవంతం కావాల్సిన అవసరముందన్నారు. అనంతరం గిరిజన మ్యూజియంలో కలియతిరిగారు. మ్యూజియంలో భద్రపరచిన ఆదివాసుల సాంప్రదాయ పనిముట్లు అభరణాలను, జీవన విధానాలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ పేందూరు మోతిరం, కుమురం భీం ఉత్సవ కమిటీ మాజీ చైర్మెన్ పేందూర్ రాజేశ్వర్ కలెక్టర్‌ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ త్రిపాఠి, తహసీల్దార్ దత్తు ప్రసాద్ రావు, ,ఎంపీడీఓ కష్టారావు, ఎస్సై గుంపుల విజయ్ కుమార్, సాంగ్వి మాజీ సర్పంచ్ తొడసం జగన్నాథ్ రావు తదితరులు పాల్గొన్నారు.



భీం సమాధి వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దౌత్రే



మ్యూజియంలో వస్తువులను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దౌత్రే

7న మహాధర్నాను విజయవంతం చేయండి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

మధ్యాహ్నభోజన పథకం కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు, అల్పాహారం బిల్లులు ఐదు నెలల నుండి చెల్లించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందని దీనిని నిరసిస్తూ ఈ నెల 7న జిల్లా కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగే మధ్యాహ్నభోజన పథకం కార్మికుల ధర్నాను జయప్రదం చేయాలని ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు, కోశాధికారి రూప ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నభోజన పథకం కార్మికులకు ఐదు నెలలుగా వేతనాలు చెల్లించడం లేనందున జిల్లా వ్యాప్తంగా కార్మికులు పాఠశాలల్లోని మధ్యాహ్నభోజన నిర్వహణ చేయడానికి అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అలాగే అల్పాహారం బిల్లులు కూడా పెండింగ్‌లో ఉండడమే కాకుండా తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ ప్రభుత్వం మధ్యాహ్నభోజన పథకం కార్మికులకు ప్రకటించిన రూ.10 వేల వేతనం, ఇతర సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని, వీటన్నింటికీ నిరసన వ్యక్తం చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా ఉన్న మధ్యాహ్నభోజన కార్మికులందరు జరిగే మహాధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పోరాటాలు చేస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు.

వార్ధా నదిపై హైలెవల్ వంతెన నిర్మించాలి

- రోడ్డుపై బైటాయించిన బీఆర్ఎస్ నాయకులు
- డిమాండ్లతో కూడిన వినతిపత్రం తహసీల్దార్‌కు అందజేత



రోడ్డుపై బైటాయించిన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-కౌటాల

వార్ధా నదిపై హైలెవల్ వంతెన నిర్మించాలని సోమవారం బీఆర్ఎస్ నాయకులు రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ పుష్పలతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆదె వసంత్‌రావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో గుండాయిపేట్ నుండి మహారాష్ట్ర నందివర్ధన్ మధ్య గల వార్ధా నదిపై హైలెవల్ వంతెన నిర్మాణం కోసం రూ.75 కోట్లు మంజూరుచేసి టెండర్లు నిర్వహించారన్నారు. ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం వంతెన నిర్మాణం రద్దు చేయాలని యోచిస్తుందని, అది మానుకొని వంతెన నిర్మాణం చేపట్టి ఈ ప్రాంత అభివృద్ధికి పాటుపడాలన్నారు. తెలంగాణ నుండి మహారాష్ట్రకు వెళ్లాలంటే నాటుపడవల్లో వెళ్తూ చాలాసార్లు ప్రమాదాలు జరిగి సుమారుగా 20 మంది వరకు చనిపోయిన సంఘటనలున్నాయన్నారు. అలాంటివి జరుగకుండా ఉండడానికి, వ్యాపారంగా అభివృద్ధి చెందడానికి గత ప్రభుత్వం ఆలోచించి మంచి నిర్ణయం తీసుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం దానిని రద్దు చేయాలనే ఆలోచనలో ఉందన్నారు. ప్రభుత్వం రద్దు అనే ఆలోచనను విరమించుకొని వెంటనే పనులు మొదలుపెట్టి, హైలెవల్ వంతెన నిర్మాణం పూర్తిచేసి ఈ ప్రాంత ప్రజానికానికి రవాణ సౌకర్యార్థం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా మండల అధ్యక్షురాలు బండి శైలజగౌడ్, నాయకులు డోంగ్రె మధూకర్, సహీంహైమద్, రాచకొండ అశోక్, మాజీ సర్పంచ్ పత్రు, దాగం ఆగయ్య, చాప్లె లహంచు, బాపు, బండి ప్రభాకర్, మాజీ ఎంపీపీ నికోడె గంగారాం పాల్గొన్నారు.

వికలాంగులందరికీ అంత్యోదయ కార్డులివ్వాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

అర్హులైన వికలాంగులందరికి అంత్యోదయ కార్డులు ఇవ్వాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి రాజేష్, ముంజం ఆనంద్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ ఆర్డీఓ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అనంతరం ఏఓ ప్రమోద్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసే అంత్యోదయ కార్డులలో వికలాంగులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు జాకీర్, సప్తగిరి, వెంకటేష్, లక్ష్మి, ప్రమీల, అశోక్, యాదగిరి, రవీందర్, ఈశ్వరి, గొర్రె రాజు పాల్గొన్నారు.

గ్యాస్ అండ్ ఆర్క్ వెల్డింగ్ కోర్సులు ప్రారంభం

నవతెలంగాణ-మందమర్రి

స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ అండర్ ఎస్‌సీసీఎల్- సీఎస్ఆర్ మందమర్రి ఏరియా రీజినల్ డైరెక్టరేట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్, ఎంటర్‌ప్రినర్‌షిప్ హైదరాబాద్ ఆధ్వర్యంలో సోమవారం గ్యాస్ అండ్ ఆర్క్ వెల్డింగ్ కోర్సులను ప్రారంభించారు. ఏరియా జనరల్ మేనేజర్ ఏ మనోహర్, కె శ్రీనివాసరావు, ఐఎస్‌డీఎస్ రీజినల్ డైరెక్టర్ 24 మంది అభ్యర్థులతో శిక్షణాలను ప్రారంభి మాట్లాడుతూ గ్యాస్ అండ్ ఆర్క్ వెల్డింగ్ కోర్సులను ప్రారంభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు నిరుద్యోగ యువతకు లబ్ధి చేకూర్చే దిశగా సింగరేణి కాలరీస్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టూ జీఎం రాజేశ్వర్ రెడ్డి, ఐఎస్‌డీఎస్ జాయింట్ డైరెక్టర్ ఆర్డిఎస్డిఈ తెలంగాణ విద్యానంద్, అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్ఎస్‌టీఐఆర్ పీకే చందేల్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు సన్మానం

నవతెలంగాణ-కాసిపేట



మండల పరిషత్ కార్యాలయంలో ఇటీవల నూతన ఎంపీడీఓగా బాధ్యతలు తీసుకున్న సత్యనారాయణ సింగ్‌ను ఆదివాసీ సంఘాల నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానం చేశారు. మండల అభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా ఎంపీడీఓకు కోరారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి ఆడె జంగు, ఏఎస్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ కిషన్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పెంద్రం హన్మంతు, రాష్ట్ర ఉపాధ్యాక్షుడు రాయిసిడం రమేష్, జిల్లా ఉపాధ్యాక్షుడు మడావి అనంతరావు, కనక గోవర్ధన్, మంగ శ్రీకాంత్, కొడప భీంరావు పాల్గొన్నారు.

నర్సరీల నిర్వహణకు ప్రత్యేక చర్యలు



నవతెలంగాణ-తాండూర్

హరితహారంలో భాగంగా నర్సరీల్లో మొక్కల పెంపకానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తాండూర్ ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం రాజీవ్ నగర్ పంచాయితీ నర్సరిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీల నర్సరీల్లో 15,910 మొక్కల పెంపకానికి చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలోని నర్సరీల్లో 85 శాతం మొలక వచ్చినట్టు వివరించారు.15 గ్రామ పంచాయతీలోని నర్సరీలో 13210 మొక్కలను సంరక్షిస్తున్నట్లు తెలిపారు. నర్సాపూర్, ద్వారకాపూర్ గ్రామపంచాయతీల నర్సరీల్లో అత్యల్పంగా 60 శాతం మాత్రమే మొలక శాతం వచ్చినట్టు తెలిపారు. 100శాతం మొక్కల పెంపకానికి చర్యలు తీసుకోవాలని పంచాయతీ సెక్రెటరీలను ఆదేశించారు. ఎండలు తీవ్రం అవుతున్నాయని నర్సరీలపై హెడ్ నెట్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీడ్స్ నాటిన బ్యాగులో కలుపును ఎప్పటికప్పుడు తీసివేయాలనన్నారు. క్రమం తప్పకుండా నీటిని అందిస్తూ 100శాతం మొలక వచ్చేటట్లు కృషి చేయాలన్నారు. మొలకలు రాని బ్యాగులో తిరిగి విత్తనాల నాటాలని సూచించారు. ఆయనతో పాటు పంచాయతీ సెక్రెటరీ కల్పన ఉన్నారు.

జన్నారంలో పల్స్ పోలియో 95 శాతం



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని 34 గ్రామాలు, 29 గ్రామపంచాయతీలో రెండవ రోజు పల్స్ పోలియో కార్యక్రమంలో సోమవారం 95 శాతం పూర్తైనట్లు మండల ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ ఉమాశ్రీ తెలిపారు. పల్స్ పోలియో కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, హెల్త్ సూపర్‌వైజర్లు ఇంటింటికి వెళ్లి చుక్కాలు వేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొనగా, మండలంలో మొత్తం 95 శాతం, చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం జరిగిందని డాక్టర్ ఉమాశ్రీ తెలిపారు.

ఎల్ఏ ఆర్అండ్ఆర్ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌గా చంద్రకళ

నవతెలంగాణ-నస్పూర్



జిల్లా భూసేకరణ, ఆర్అండ్ఆర్ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌గా డి.చంద్రకళ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాంబర్‌లో జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అధికారుల సమన్వయంతో కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. గద్వాల్ జిల్లా గద్వాల్ ఆర్డీఓగా పని చేస్తున్న డి. చంద్రకళ పదోన్నతిపై జిల్లా భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ ప్రత్యేక ఉప పాలనాధికారిగా వచ్చారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావాణి



నవతెలంగాణా-జన్నారం

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావాణి నిర్వహించడం జరుగుతుందని తహసీల్దార్ రాజ మనోహర్ రెడ్డి, ఎంపీడీఓ శశికళ అన్నారు. సోమవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. సమస్యలతో వచ్చిన ప్రజలకు అక్కడికక్కడే పరిష్కారం చూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాలువ నిర్మాణం చేపట్టాలని వినతి

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని కోమటిచేను శివారులోని సల్పాలవాగు ప్రాజెక్ట్ ఎడుమ కాలువ నిర్మాణం చేపట్టాలని కోరుతూ కోమటిచేను రైతు రాంటెంకి వాస్‌దేవ్ ప్రజావాణి కార్యక్రమంలో తహసీల్దార్ భోజన్నకు వినతిపత్రం అందించారు. 2005లో సల్పాలవాగు చెరువు పూర్తి చేశారని, చెరువు కింద 3200 ఎకరాల సాగు భూమి ఉందని, కారి ఎడుమ కాలువ నిర్మాణం చేపట్టపోవడంతో గుంట భూమికి సాగు నీరు అందడం లేదని, కాలువ నిర్మాణం అసంపూర్తిగా ఉందని, వెంటనే కాలువ నిర్మాణం పూర్తి చేసి రైతులకు సాగు నీరు అందించాలని కోరారు.



ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం

నవతెలంగాణ-లక్షెట్టిపేట



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ కిషన్

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని స్వీప్ నోడల్ అధికారి, డీఆర్‌డీఓ కిషన్ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వచ్చే లోక్ సభ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగంపై రాజనీతి శాస్త్ర విభాగం, ఎలక్టోరల్ క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వీప్ నోడల్ అధికారి, డీఆర్‌డీఓ కిషన్ మాట్లాడుతూ సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యూకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్' అనేది బలమైన ప్రజాస్వామ్య నిర్మాణానికి పునాది లాంటిందన్నారు. 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటును ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా వినియోగించుకోవాలన్నారు. డా. బీఆర్ అంబేద్కర్ లాంటి మహనీయులు ఎలాంటి తారతమ్యాలు లేకుండా దేశంలోని అందరికీ ఓటు హక్కును కల్పించడంలో ఎంతగానో కృషి చేసినట్లు వివరించారు. మెరుగైన సమాజం, ప్రజాస్వామ్యం ఫరిడవిల్లాలంటే ఆదర్శవంతమైన రాజకీయ నాయకులను ఓటు ద్వారా ఎన్నుకున్నప్పుడే సాధ్యమవుతుందన్నారు. ముఖ్యంగా విద్యార్థులు తమ ఓటును నమోదు చేసుకుని, ఇతరులకు కూడా ఓటు విలువను తెలియజేయాలని సూచించారు. అంతకు ముందు కళాశాల ప్రిన్సిపల్ డా. జై కిషన్ ఓజా మాట్లాడుతూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నప్పుడే మనం ఉత్తమ పౌరులుగా పరిగణించబడతామన్నారు. రాజ్యాంగం ప్రసాదించిన ఓటును ఎట్టి పరిస్థితుల్లో కుల, మత, ఇతర ప్రతిపాదికన దుర్వినియోగం చేయకుండా మంచి ప్రజా ప్రతినిధులను ఎన్నుకోవాలన్నారు. అదే విధంగా ఓటు హక్కు గురించి, దాని ప్రాధాన్యతను తల్లిదండ్రులకు, ఇతరులకు విద్యార్థులు వివరించాలన్నారు. అనంతరం తహసీల్దార్ రాఘవేంద్ర రావు మాట్లాడుతూ 18 ఏండ్లు నిండిన వారు వెంటనే ఓటర్‌గా తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. తమ సిబ్బంది అందుబాటులో ఉంటారని, అదే విధంగా ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేసుకోవచ్చన్నారు. అనంతరం ఎంపీడీఓ సరోజ మాట్లాడుతూ ఓటింగ్‌లో అందరూ పాల్గొన్నప్పుడే ప్రజాస్వామ్యం బలపడుతుందని, నాకెందుకు అనే నిర్లక్ష్య ధోరణి మంచిది కాదన్నారు. ఈ సందర్భంగా కళాజాత బృందం ఆధ్వర్యంలో కళాకారులు పాటలతో విద్యార్థులకు ఓటు అవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ ఎలక్టోరల్ క్లబ్ ప్రచారకర్త సంధ్యారాణి, స్వీప్ నోడల్ కోఆర్డినేటర్లు రాంచందర్, కుమార్, కళాజాత బృందం నాయకులు రమేష్, మురళి, ఇతర సభ్యులు, ఏపీఓ వెంకటరమణ, ఏపీఎమ్ లక్ష్మి కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రజలతో పోలీసులు మమేకమై పనిచేస్తున్నారు'



జన్నారం స్టేషన్‌లో వివరాలు తెలుసుకుంటున్న సీపీ శ్రీనివాసులు



లక్షెట్టిపేటలో సీపీ శ్రీనివాసులుకు పూల మొక్కను అందిస్తున్న సీఐ

నవతెలంగాణ-జన్నారం

ప్రజలతో పోలీసులు మమేకమై పనిచేస్తున్నారని రామగుండం సీపీ శ్రీనివాసులు అన్నారు. సోమవారం పోలీసు స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ముందుగా సీపీకు ఎస్సై సతీష్, పోలీసులు గౌరవ వందనం చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న పబ్లిక్ పరీక్షలకు భారీ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకుంటూ వారితో పోలీసులు మమేకమై పని చేయాలని ఆయన సూచించారు. చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. పీడీ యాక్ట్ అమలు చేస్తామని హెచ్చరించారు. పోలీస్ స్టేషన్ పరిధి బౌగోలిక పరిస్థితులు, గ్రామపంచాయతీలు, అమ్లెట్ గ్రామాలు, పోలీస్ స్టేషన్ పరిధి గ్రామాల్లో ఎలాంటి నేరాలు అధికంగా జరుగుతున్నాయనే, వాటిని ఏవిధంగా నియంత్రణ తదితర వాటి గురించి పోలీసులను అడిగి తెలుసుకున్నామన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవరిస్తూ కేసుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకుని జాప్యం చేయకుండా పరిష్కరించాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో బీట్లు, పెట్రోలింగ్ పకడ్బందీగా నిర్వహిస్తూ నేరాలను నియంత్రించాలన్నారు. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, గుడుంబా, గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ అశోక్ కుమార్, మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్, మంచిర్యాల రూరల్ సీఐ అశోక్ కుమార్, లక్షెట్టిపేట సీఐ ఏ. నరేందర్, ఎస్సైలు నరేష్ కుమార్, చంద్ర కుమార్, సతీష్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

లక్షెట్టిపేట పోలీస్ స్టేషన్ సందర్శన..

లక్షెట్టిపేట : రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాసులు పోలీస్ అధికారులతో కలిసి లక్షెట్టిపేట పోలీస్ స్టేషన్ సందర్శించి పరిసరాలను పరిశీలించారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ గతంలో కేసులున్న నేరస్థులకు, భూ కబ్జాలకు పాల్పడి పలు రకాల కేసుల్లో ఉండి ప్రస్తుతం సత్ప్రవర్తనతో, నేర పూరిత జీవితానికి దూరంగా ఉండి మంచి జీవితం గడుపుతున్న వారికి మంచిగా మారేందుకు అవకాశం ఇస్తామని, రౌడీ షీట్స్ ఉంటే చట్టపరిధిలో తీసివేస్తామని తెలిపారు. అక్రమ దందాలు అరికట్టేందుకు ప్రత్యేక టీమ్ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ప్రభుత్వం పేద ప్రజలకు ఇచ్చే బియ్యం కేవలం ప్రజలకే అందాలని పక్కదారి పట్టిస్తే చర్యలుంటాయన్నారు. పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతి భద్రతలను కాపాడాలన్నారు. ఇందులో మంచిర్యాల డీసీపీ అశోక్ కుమార్, ఏ సీపీఆర్ ప్రకాష్, లక్షెట్టిపేట సీఐ నరేందర్, ఎస్సై చంద్రకుమార్, అదనపు ఎస్సై రామయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విదేశాల్లో పని చేసేందుకు అవకాశం

నవతెలంగాణ-నస్పూర్

తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టీఓఎంసీఓఎం), తెలంగాణ ప్రభుత్వ కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ క్రింద రిజిస్టర్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ ద్వారా ఇజ్రాయిల్‌లో నిర్దిష్ట నైపుణ్యం కలిగిన నిర్మాణ కార్మికులు, జర్మనీలో నర్సులుగా పని చేయుటకు అర్హత కలిగిన వారికి శిక్షణ, నియామకం కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి కౌశిక్ వెంకట రమణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇజ్రాయిల్ నిర్మాణ కార్మికులు షట్టరింగ్ కార్పెంటర్లు, సిరామిక్ టైలింగ్, ప్లాస్టరింగ్, ఐరన్ బెండింగ్ పనులు చేయడానికి అవకాశం ఉందని, ఉద్యోగాలకు నెలకు రూ.లక్ష20 వేల నుండి రూ.లక్ష38 వేల జీతం ప్యాకేజీ ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు ఎస్-ఎస్‌సీ ఉత్తీర్ణులై కనీసం 3 సంవత్సరాల అనుభవం, 21-45 సం. మధ్య వయస్సు ఉండాలని తెలిపారు. జర్మనీలో నర్సింగ్ ఉద్యోగ అవకాశాల కోసం 1-3 సం.ల అనుభవం ఉండి 21-38 సం.ల మధ్య వయస్సు గల బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు భారతదేశంలో బీ-1 స్థాయి వరకు జర్మన్‌ను అభ్యసించే అవకాశం ఉంటుందని, జర్మన్ యజమానితో విజయవంతమైన నియామకం తరువాత, రిజిస్టర్డ్ నర్సుగా గుర్తింపు పొందే వరకు జర్మనీలో ఆస్పత్రులు, కేర్ హోంలో నర్సింగ్ సహాయకులుగా పని చేస్తారని, స్థానం పొందిన అభ్యర్థులకు నెలకు రూ. 2 లక్షల నుండి రూ.2 లక్షల 50 వేల వరకు పొందుతారన్నారు. అభ్యర్థులు ఈ నెల 7న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో నిర్వహించనున్న ఎన్‌రోల్మెంట్ డ్రైవ్‌ను వినియోగించుకోవాలని కోరారు. వివరాలకు నంబర్ 9985483931, 9849639539, 7893566493లలో సంప్రదించాలన్నారు.

మున్నూరు కాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-నస్పూర్



తెలంగాణాలో అత్యధిక జనాభా ఉన్న మున్నూరు కాపుల సంక్షేమానికి ప్రభుత్వం వెంటనే మున్నూరు కాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య డిమాండ్ చేశారు. సోమవారం నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణాలో బీసీ జనాభాలో 26 శాతం మున్నూరు కాపులున్నారన్నారు. 60 లక్షల మున్నూరు కాపులు వ్యవసాయంపైనే ఆధారపడి ఉన్నారని, కాపులు ఆర్థికంగా, సామాజికంగా, విద్యా ఉద్యోగ రంగాల్లో రానించాలంటే ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. హైదరాబాద్ కోకాపేటలో మున్నూరు కాపు భవనానికి స్థలం కేటాయించారని, కానీ కేవలం రూ.5 కోట్లు మాత్రమే నిధులు ఇవ్వడం వల్ల సరిపోవడం లేదన్నారు. వెంటనే రూ.20 కోట్లు కేటాయించాలన్నారు. ప్రతీ జిల్లా కేంద్రంలో కాపు భవనాలకు 2 ఎకరాలు కేటాయించి రూ.3 కోట్ల నిధులు కేటాయించాలన్నారు. ఎంపీ ఎన్నికల్లో కాపులకు అన్ని పార్టీలు టికెట్లు కేటాయించాలని, ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటుపై మ్యానిఫెస్టోలో పెట్టాలని కోరారు. ప్రతి జిల్లాలో మున్నూరు కాపు విద్యార్థులకు హాస్టళ్లు నిర్మించాలన్నారు. పారిశ్రామిక ప్రోత్సాహం కల్పించడానికి నిరుద్యోగ యువకులకు రుణాలు అందించి చిన్న, మధ్యతరహ పరిశ్రమలు ఏర్పాటుకు అవకాశం కల్పించాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ నామినేటెడ్ పదవులు మున్నూరు కాపులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. కాపుల సంక్షేమానికి అన్ని విదాల నిర్ణయాలు తీసుకోకుంటే భవిష్యత్తులో పోరాటాలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ బోరిగం రాజారాం, యూత్ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజీవ్, మున్నూరు కాపు డెవలప్‌మెంట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఎడ్ల రవి, రాష్ట్ర కన్వీనర్ చింతపండు మహేందర్, యూత్ జిల్లా అధ్యక్షుడు సీపతి సురేష్, నాయకులు గొంగల్ల శంకర్, సతీష్, తిరుపతి, ఆరె శ్రీనివాస్, ఆకుల బాలకృష్ణ, రవి పాల్గొన్నారు.

ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలి



నవతెలంగాణ-నస్పూర్

ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి.రాహుల్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీఓలు వి.రాములు, హరికృష్ణతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో 71 దరఖాస్తులు అందాయని, వీటిపై సమగ్ర విచారణ జరిపి పరిష్కారం దిశగా సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాక్ పోలింగ్



నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యా శాఖ ఆదేశాల మేరకు మాక్ పోలింగ్ నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మామిడిపెల్లి సాంబమూర్తి సూచనలతో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీసుధారాణి ఆధ్వర్యంలో విద్యార్థులు ఉత్సాహంగా ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించిన ఓటింగ్ కార్యక్రమంలో పాల్గొని పాఠశాల నాయకున్ని ఎన్నుకున్నారు. సాధారణ ఎన్నికలకు అద్దం పట్టే విధంగా నోటిఫికేషన్, నామినేషన్ల స్వీకరణ, అభ్యర్థుల ప్రకటన, గుర్తుల కేటాయించి పోలింగ్ నిర్వహించారు. ఓటర్లుగా విద్యార్థులు తమ నాయకున్ని ఎన్నుకున్నారు. మాక్ పోలింగ్ ద్వారా విద్యార్థి దశ నుంచే ఎన్నికలు, ప్రజాస్వామ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించామని, భవిష్యత్తులో మంచి నాయకులుగా ఎదగడానికి, నాయకున్ని ఎన్నుకోవడానికి ఈ ఎన్నికల విధాన ప్రక్రియ ఎంతగానో ఉపయోగపడుతుందని ఇన్‌చార్జి హెచ్ఎం తెలిపారు. ఈ నమూనా ఎన్నికల విధానాన్ని ఉపాధ్యాయులు లలిత, రవి కుమారి, వేణు, సికిందర్, స్వామి పర్యవేక్షించారు.

నేషనల్ యోగా అవార్డును అందుకున్న భగవాన్‌దాస్



నవ తెలంగాణ-లక్షెట్టిపేట

బెస్ట్ యోగ మాస్టర్ నేషనల్ అవార్డు-2024కు గాను రాపల్లి భగవాన్ దాస్ (అటవీ శాఖ రిటైర్డ్ సూపరింటెండెంట్) అందుకున్నారు. మార్చి 3న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన భవన్‌లో జరిగిన బహుజన సాహిత్య అకాడమీ ఏడవ తెలంగాణ రాష్ట్ర కాన్ఫరెన్స్‌లో జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవార్డు రావడంతో మరింత బాధ్యత పెరిగిందని, తాను నిర్వహించే ఉచిత యోగ శిబిరంలో అధిక సంఖ్యలో పాల్గొని ఆరోగ్య భాగ్యంను పొందాలని కోరారు.

ఘనంగా తాళ్లపల్లి కొమురయ్య వర్ధంతి



నవతెలంగాణ-నస్పూర్

సింగపూర్ మాజీ ఉపసర్పంచ్ తాళ్లపల్లి కొమురయ్య 15వ వర్ధంతి వేడుకలు శ్రీరాంపూర్ ఏరియాలోని స్మారక స్థూపం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్ అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ కొమురయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీలో క్రియాశీలక నాయకునిగా పనిచేసే యువజన విద్యార్థి రంగాలకు నాయత్వం వహించారని గుర్తు చేశారు. ప్రజా ప్రతినిధిగా సింగపూర్ ఉపసర్పంచ్‌గా ప్రజలకు సేవలు అందించిన కొమురయ్య సేవలు మరువలేనివని తెలిపారు. ఈ కార్యక్రమంలో రేగుంట చంద్రశేఖర్, జోగుల మల్లయ్య, ముస్కే సమ్మయ్య ఎస్కే బాజి సైదా, లింగం రవి, కారుకురీ నగేష్ పాల్గొన్నారు.

మహిళలకు ఆటల పోటీలు

నవతెలంగాణ నస్పూర్



ఈనెల 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నస్పూర్ కాలనీలోని మనోరంజన్ సముదాయంలో సింగరేణి యాజమాన్యం శ్రీరాంపూర్ ఆధ్వర్యంలో సోమవారం మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను డీవై పీఎం దేవేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలకు బాంబ్ బ్లాస్ట్, టగ్ ఆఫ్ వార్, త్రో బాల్ పోటీలను చేపట్టగా ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ సూపర్‌వైజర్ చాట్ల అశోక్, కోఆర్డినేటర్ తోట సురేష్, సేవా సెక్రటరీ కొట్టే జ్యోతి, శారద, మంగ, సునీత, రజిత, భవాని, మమత పాల్గొన్నారు.

జిల్లాలో కొనసాగుతున్న పల్స్ పోలియో

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయడంలో భాగంగా ఆదివారం నిర్వహించిన పోలియో ఆదివారంలో మిగిలిన వారికి సోమవారం ఇంటింటికి తిరిగి సిబ్బంది పోలియో చుక్కలు వేశారు. సోమవారం జిల్లాలో 1,36,712 గృహాలలో 1,21,241 గృహాలను సందర్శించినట్లు అధికారులు తెలిపారు. ఆదివారం పోలియో చుక్కలు వేయించుకొని ఐదు సంవత్సరాలలోపు పిల్లలను 3768 మందిని గుర్తించి చుక్కలు వేసినట్టు తెలిపారు. సోమవారం నాటికి 99.3శాతం లక్ష్యాన్ని చేరినట్లు వివరించారు.

సమిష్టి కృషితో జిల్లా అభివృద్ధికి పాటుపడదాం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

అందరూ సమిష్టిగా కృషిచేసి జిల్లా అభివృద్ధికి పాటుపడదామని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి కోసం సమిష్టిగా కృషి చేద్దామన్నారు. గతంలో ఉన్న జీహెచ్ఎంసీలో చేసిన అనుభవంతో జిల్లాలో ఉన్న మున్సిపాలిటీల అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు క్షేత్రస్థాయిలో వెళ్లేలా చూస్తానన్నారు. విద్య వైద్యంతో పాటు మౌలిక వసతుల కల్పనే తన లక్ష్యమని పేర్కొన్నారు. జిల్లాలో సమస్యలతో పాటు అవినీతి అక్రమాలు తన దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో జిల్లా అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. అంతకు ముందు జిల్లాకు నూతనంగా వచ్చిన కలెక్టర్‌కు జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, డీపీఆర్ఓ సంపత్‌తో పాటు, ఆసిఫాబాద్ ప్రెస్ క్లబ్ సభ్యులు పుష్పగుచ్చం ఇచ్చి స్వాగతం పలికారు.

మున్నూరు కాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మున్నూరు కాపు సంఘం ఫైనాన్స్ కార్పొరేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య పటేల్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని రంగాలలో వెనుకబడిన మున్నూరుకాపుల అభివృద్ధి కోసం రూ. 5వేల కోట్లతో ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి జిల్లాలో మున్నూరు కాపు సంఘం భవనం ఏర్పాటు చేయాలన్నారు. సంఘం బలోపేతానికి అందరూ కలిసికట్టుగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువత అధ్యక్షులు బండి సంజీవ్, నాయకులు మిట్ట వెంకన్న, గడ్డల సురేష్, అడప సతీష్, మనిగొండ వెంకన్న, కుంధరపు శంకరమ్మ, గణపతి సదాశివ, జక్కయ్య, తిరుపతి, గుర్రాల వెంకన్న, గోపాల్ పాల్గొన్నారు.

గోలేటిలో మహిళలకు క్రీడా పోటీలు



నవతెలంగాణ-రెబ్బెన

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిలోని ఆఫీసర్స్ క్లబ్‌లో మహిళలకు సోమవారం మహిళలకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను సేవా సమితి ఉపాధ్యక్షురాలు నలిని నరేందర్ ప్రారంభించారు. షాట్‌పుట్, బాలింద బాస్కెట్, త్రోబాల్ పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు మహిళా దినోత్సవం రోజు ప్రధాన వేడుకల్లో బహుమతులు అందజేయనున్నట్టు తెలిపారు.

పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన సీఐ



నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని మందమర్రి సీఐ కే శశిధర్ పరిశీలించారు. ఎస్ఐ ఏ.గంగారాంతో కలిసి సీఐ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. భద్రత విషయాలు, ఇబ్బందులేమైనా ఉన్నాయనే విషయాలపై పరీక్ష కేంద్రం అధికారులతో పాటు పోలీస్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

నేటి నుంచి మూడు రోజులు రైల్వేగేటు మూసివేత

నవతెలంగాణ-రెబ్బెన

రైల్వే లైన్ మరమ్మత్తుల కారణంగా మూడు రోజుల పాటు రైల్వే గేటు మూసివేసి ఉంటుందని రైల్వే అధికారులు తెలిపారు. రెబ్బెన రైల్వేగేటు మూడో లైన్ ట్రాక్ మరమ్మత్తు పనుల్లో భాగంగా ఈ నెల 5వ తేదీ నుండి 7వ తేదీ వరకు గేటు మూసివేయబడుతుందని, మండలంలోని నంబాల, తుంగెడ, గంగాపూర్, కిష్టాపూర్, నారాయణపూర్, జక్కులపల్లి, మాధవాయిగూడ తదితర గ్రామాల ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

బ్లాస్టింగ్ కార్మికులకు స్కిల్డ్ వేతనాలు చెల్లించాలి

- కాంట్రాక్టు కార్మికుల సంఘం ఉపాధ్యక్షుడు ఓదెలు



సమావేశంలో మాట్లాడుతున్న కాంట్రాక్టు కార్మికుల సంఘం ఉపాధ్యక్షుడు ఓదెలు

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి ఖైరిగూడ, ఓపెన్‌కాస్ట్ మైన్స్‌లో పనిచేస్తున్న బ్లాస్టింగ్ కార్మికులకు స్కిల్డ్ వేతనాలు చెల్లించాలని, పని స్థలాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం(సీఐటీయూ) ఉపాధ్యక్షుడు ఎ.ఓదెలు డిమాండ్ చేశారు. సోమవారం ఖైరిగూడ ఓసీపీ వద్ద జరిగిన బ్లాస్టింగ్ కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈఆర్ఎన్ కంపెనీ కార్మికులకు ప్రస్తుతం చెల్లిస్తున్న అన్ స్కిల్డ్ వేతనం కూడా అతి తక్కువగా ఉందని, కనీసం రోజుకు రూ.504, నెలకు రూ.13,104 మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. కోలిండియాలో రోజుకు ఒక కార్మికుడికి రూ.1199, నెలకు రూ.31,174 చెల్లిస్తున్నారని, అదే విధంగా సింగరేణిలో పనిచేస్తున్న బ్లాస్టింగ్ కార్మికులకు కోలిండియా తరహా వేతనాలు చెల్లించి వారిని ఆదుకోవాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలు అధికారంలో ఉండి కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచకుండా తీవ్ర అన్యాయం చేసిందన్నారు. జీఓ నంబర్ 22ను అమలుచేయకుండా కాంట్రాక్టర్లకు లొంగిపోయి కార్మికులకు అన్యాయం చేశారని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే జీఓ నంబర్ 22 ప్రకారం వేతనాలు చెల్లిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, జీఓనెంబర్ 22ను ప్రక్కకు పెట్టి కొత్త జీఓ నెంబర్ 94ను తీసుకొచ్చి కార్మికులకు మరింత అన్యాయం చేశారన్నారు. జీఓ నెంబర్ 22 ప్రకారం నెలకు రూ.21 వేలు ఉండగా కొత్తగా జీఓ తీసుకొచ్చి కార్మికులకు రూ. 11325 మాత్రమే ఉండేటట్టు చేసి కార్మికులకు మరింత ద్రోహం చేశారన్నారు. సింగరేణిలో పనిచేస్తున్న అన్ని విభాగాల కాంట్రాక్టు కార్మికులు అటు కోలిండియా వేతనాలు రాక, ఇటు జీఓ నంబర్ 22 అమలుకాక ప్రతిరోజు రూ.304 నుండి రూ.695 నష్టపోతున్నారన్నారు. కాంట్రాక్టు కార్మికులను ప్రభుత్వాలు శ్రమదోపిడికి గురిచేస్తున్నాయని, చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించలేక అప్పుల పాలు అవుతున్నారని, ఇప్పటికైనా కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం కాంట్రాక్టు కార్మికులకు కోలిండియా తరహా వేతనాలు పెంచి వారిని ఆదుకోవాలన్నారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

- కార్పొరేట్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి
- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి



అదనపు కలెక్టర్ రాహుల్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నవతెలంగాణ-నస్పూర్

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని, తోక పేర్లతో(టెక్నో కరికులం,ఐఐటీ, జేఈఈ) నడుస్తున్న కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి అన్నారు. సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ రాహుల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఐదు సంవత్సరాల నుండి స్కాలర్‌షిప్‌లు కాలేదన్నారు. సంక్షేమ హాస్టల్లో చదువుకునే విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలకు మంచి బియ్యం సరఫరా చేయాలన్నారు. ప్రయివేటు పాఠశాలు పర్మిషన్ లేకుండా నడిపిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, ఫీజుల నియంత్ర చట్టం తీసుకురావాలని, లక్షట్టిపేట్, దండేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల శిథిలావస్థలో ఉన్నయని అధికారులు పరిశీలించి నూతన భవనాలు మంజూరు చేయాలన్నారు. పదవ తరగతి విద్యార్థులకు స్పెషల్ మెనూ అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గర్ల్స్ కన్వీనర్ సానియా, గాయత్రి, యాసిన్, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ఈదూనూరి అభినవ్, బండి సత్యనారాయణ పాల్గొన్నారు.

హైమన్‌డార్ఫ్ సేవలు నేటికీ ఆదర్శం

నవతెలంగాణ-జైనూర్



హైమన్‌డార్ఫ్, బేటీ ఎలిజబెత్ చేసిన సేవలు మరువలేనివని కలెక్టర్ వెంకటేశ్ దౌత్రె అన్నారు. సోమవారం మండలంలోని చారిత్రాత్మక గ్రామమైన మార్లావాయి గ్రామాన్ని ఆయన సందర్శించారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన మొదటిరోజే మార్లావాయి గ్రామానికి ఆయన సందర్శించడంతో స్థానిక సర్పంచ్ కనక ప్రతిభ వెంకటేశ్ ఆధ్వర్యంలో ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలతో తలపాగా చేసి ప్రత్యేకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా హైమన్‌డార్ఫ్ బేటీఎలిజబెత్ నివసించిన ప్రాంతాన్ని, ఆయన నివసించిన ఇల్లును సందర్శించారు. అనంతరం ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చేసిన గ్రామ పంచాయతీతో పాటు మార్లావాయి గ్రామంలో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం చేపడుతున్న కార్యక్రమాలపై మండల అభివృద్ధి అధికారి ప్రభుదయను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మార్లావాయి గ్రామం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కలెక్టర్‌కు స్థానికులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఆయన వెంట అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారీ, నాయకులు, గ్రామ పటేళ్లు, దేవారీలున్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన సీపీ శ్రీనివాస్



నవతెలంగాణ-నస్పూర్

మంచిర్యాల ఐబీ చౌరస్తాలోని అల్ఫోర్స్ జూనియర్ కళాశాలలోని ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని సోమవారం రామగుండం సీపీ శ్రీనివాస్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉన్నందున పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఎక్కువ మంది గుమిగూడవద్దని సూచించారు. పరీక్షలు జరిగే సమయంలో పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. అధికారులు ఎవరైన సరే పూర్తిగా తనిఖీ చేశాకే కేంద్రం లోపలికి అనుమతించాలని సిబ్బందికి సూచించారు. ఇంటర్మీడియట్ పరీక్షలు కోసం పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని, పరీక్ష సమయం కన్నా గంట ముందు పరీక్ష కేంద్రాల చుట్టూ పోలీసులు తనిఖీ చేస్తారని తెలిపారు. ప్రశ్నపత్రాలు తీసుకెళ్లడం, ఎగ్జామ్ పూర్తయిన తర్వాత జవాబు పత్రాలను తిరిగి పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చే వరకు పోలీసు భద్రత ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద కూడా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఆయన వెంట మంచిర్యాల డీసీపీ అశోక్ కుమార్, ఏసిపి ఆర్.ప్రకాష్, పట్టణ ఇన్‌స్పెక్టర్ రవీందర్ ఉన్నారు.

శాఖల పరంగా సమస్యలకు పరిష్కారం

నవతెలంగాణ-జైపూర్



సమస్యల పరిష్కారం కోసం ధరఖాస్తు చేసుకున్న వారికి శాఖల పరంగా సమస్యలకు పరిష్కార మార్గం చూపిస్తామని భీమారం ఎంపీడీఓ రాధ రాథోడ్ హామీ ఇచ్చారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఖాజిపల్లి గ్రామానికి చెందిన బాపు తమ భూ సమస్యకు పరిష్కారమార్గం చూపించాలని ధరఖాస్తు చేసుకున్నారు. అదేవిదంగా భీమారం మండల కేంద్రానికి చెందిన బండి రుక్మయ్య గృహజ్యోతి పథకానికి ధరఖాస్తు చేసుకున్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో అందుబాటులో లేనందున ప్రజాపాలనలో ధరఖాస్తు చేసుకోలేక పోయానని పేర్కొంటూ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల ద్వార లబ్ధిపొందుటకు అవకాశం కల్పించాలని కోరారు.

ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యం



నవతెలంగాణ-దండేపల్లి

ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పిఆర్టియు పనిచేస్తుందని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వతి సత్యనారాయణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ సంఘాన్ని ఎంతగానో ఆదరిస్తున్నారని, వారి నమ్మకాన్ని సంఘం నిలబెడుతుందని అన్నారు. ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం చేస్తున్న సంఘంలో సభ్యత్వం కొరకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో రావడం హర్షించదగ్గ విషయమని అన్నారు. ఈ సందర్భంగా సభ్యత్వం తీసుకున్న ఉపాధ్యాయులకు రశీదులు అందజేశారు. సిపిఎస్ రద్దు, 2003 డిఎస్సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం, డిఏ విడుదల, పెండింగ్ బిల్లుల సమస్యల పరిష్కరించాలని, మిగిలిపోయిన ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ వెంటనే చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సురినేని గంగాధర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రవికాంత్, ఉపాధ్యక్షులు ఎస్ రాజేశ్వరరావు, జిల్లా నాయకులు బోయిని శ్రీనివాస్, రామ్మోహన్‌రావు, మండల అధ్యక్ష కార్యదర్శులు ఇప్ప రవి, పానుగంటి లక్ష్మణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గృహజ్యోతి పథకం ప్రారంభం



నవతెలంగాణ-తాండూర్

మండలంలోని రేచిని గ్రామ పంచాయతీలో గృహజ్యోతి పథకాన్ని సోమవారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో మహిళలకు బస్సు ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ 10 లక్షలకు పెంపు, మహాలక్ష్మీ పథకంలో రూ. 500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలను అధికారంలోకి వచ్చిన 3నెలల్లోనే అమలు చేసిందని హర్షం వ్యక్తం చేశారు. త్వరలోనే మిగతా గ్యారెంటీలను ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ సంతోష్, మాజీ సర్పంచ్ దుర్గుబాయి, నాయకులు ఆనంద్, శ్రీనివాస్, శ్రీకాంత్, భాస్కర్‌గౌడ్, మల్లేష్, రవితేజ, మధు, కృష్ణ, గణేష్, అంజి పాల్గొన్నారు.

బెల్లంపల్లిలో బాడీ బిల్డింగ్ పోటీలు



నవతెలంగాణ-తాండూర్

స్కై జిమ్ యాజమాన్య సహకారంతో బెల్లంపల్లిలో తెలంగాణ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మిస్టర్ బెల్లంపల్లి-2024 పోటీలు నిర్వహించారు. దీనికి రాష్ట్ర కాంగ్రెస్ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి, తాళ్లగురజాల సిఐ, ఎస్సై హాజరయ్యారు. గెలుపొందిన బాడీ బిల్డర్స్‌కు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా నాతరి స్వామి మాట్లాడుతూ బాడీ బిల్డర్స్ బెల్లంపల్లికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. మానసిక ఉల్లాసానికి వ్యాయామం కూడా చాలా ముఖ్యమన్నారు. యువతకు సహకారాన్ని అందిస్తున్న స్కై జిమ్ యాజమాన్యానికి అభినందనలు తెలిపారు.

ప్రజాపాలన దరఖాస్తులకు ప్రత్యేక కౌంటర్



నవతెలంగాణ-నస్పూర్

ప్రజాపాలన దరఖాస్తు చేసుకోని వారి కోసం మున్సిపాలిటీ కార్యాలయంలో సోమవారం ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. ప్రతిరోజు ఉదయం 10:30 నిమిషాల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ ఛైర్మెన్ వేణు, మున్సిపల్ కమిషనర్ సతీష్ కోరారు. ఈ దరఖాస్తులకు పాస్ పోర్టు సైజ్ ఫోటో, ఆధార్ కార్డ్, రేషన్ కార్డు, కరెంట్ బిల్, గ్యాస్ బిల్ వెంట తీసుకురావాలని సూచించారు.